## 2 వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

ఏలూరు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఫిబ్రవరి 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వేను చేపడుతున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి ప్రకటించారు. కుష్ఠువ్యాధిపై ముద్రించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను బుధవారం ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కుష్ఠు లక్షణాలున్న వారిని గుర్తించేందుకు మెడికల్ క్యాంపులను నిర్వహించి వారికి సకాలంలో వైద్యసాయం అందించడం ద్వారా కుష్ఠువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తామన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, జిల్లా లెప్రసీ నివారణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## 17 మంది ఎల్‌పీజీ డీలర్లకు నోటీసులు జారీ

ఏలూరు సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : దీపం పథకం లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారించి 17 మంది ఎల్‌పీజీ డీలర్లకు నోటీసులు ఇచ్చినట్టు జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. దీపం పథకం అమలుపై కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని గ్యాస్ డీలర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దీపం పథకంపై లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ అనంతరం రుజువైతే ఆ గ్యాస్ ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. రశీదులో ముద్రించి ఉన్న ధరకంటే అదనంగా వసూలు చేస్తే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ సేల్స్ అధికారికి, తహసీల్దార్/ పౌరసరఫరాల తహసీల్దార్ లేదా జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి వారికి లేదా టోల్ ఫ్రీ నెంబరు 18004256453/1967 నెంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. డీఎస్‌వో ఆర్‌ఎస్‌ఎస్ సత్యనారాయణ రాజు, అధికారులు, గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

## నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి : పీవో

బుట్టాయగూడెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో గిరిజన నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని కేఆర్ పురం ఐటీడీఏ పీవో, ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్ అన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలతో పాటు పరిహారం వివిధ సమస్యలపై బుధవారం ఐటీడీఏలో నిర్వాసిత గిరిజనులు పీవోను కలిసి వినతి పత్రాలు అందజేశారు. కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటానని, ప్రతి వినతి పత్రాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటానని పీవో తెలిపారు.



గిరిజన దర్బార్‌లో నిర్వాసితుల సమస్యలు వింటున్న పీవో రాములు నాయక్



# అంత చేస్తే.. ఇంతేనా!

## స్థానిక ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ఒత్తిళ్లు

- స్థానికంగా ఉపాధి కోసం ఆరాటం
- ఆప్కోస్ ద్వారా భర్తీ కాక మరింత నిరాశ
- పార్టీ శ్రేణుల్లో మరింత అసంతృప్తి పెరగకముందే చెక్ పెట్టేందుకు సిద్ధం
- సీఎం చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు

"పార్టీ కోసం వైసీపీ బెదిరింపులకు తలొగ్గలేదు. అక్రమ కేసులు పెడతామంటే తగ్గేదేలేదన్నాం. జనం మధ్యన తిరిగాం. పార్టీ గెలవాలని పదేపదే ప్రచారం చేశాం. అన్ని చోట్ల అడ్డంకులే. పంటి బిగువున అన్నీ మోసాం. అనుకున్నట్టుగానే పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇన్నాళ్ళు పడిన కష్టం ఒక్కసారిగా తీరిపోయిందనుకున్నాం. కాని ఆరు నెలలు గడిచినా మా బిడ్డలకు ఏదో సాయం పార్టీపరంగా దక్కనేలేదు. చిన్నో చితకో ఉద్యోగం వస్తే కుటుంబం ఒడ్డెక్కుతుందనుకున్నాం. కాని అదీ తీరడంలేదు.. టీడీపీ ఎమ్మెల్యేల ఎదుట కార్యకర్తల ఆక్రోశమిది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేల మీద స్థానిక నేతల నుంచి రోజురోజుకి ఒత్తిడి పెరుగుతూనే ఉంది. కూటమి అధికారంలోకి వస్తే తమకు తిరుగులేదని బిడ్డల భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని ఆశలు పెంచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టింది కాబట్టి త్వరలోనే తమ కష్టాలు ఒక్కొక్కటిగా గట్టెక్కుతాయని ఊహించారు. తగ్గట్టుగానే ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపిస్తుండడం, పరిష్కారానికి అధికారులు ముందుకు రావడం పార్టీ కేడర్‌లో మరింత స్థైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. వీటన్నింటికీ కంటే మించి వైసీపీ పూర్తిగా తెరమరుగుకావడం, అదేక్రమంలో కూటమి శ్రేణులకు నామినేటెడ్ పదవులు దక్కడం జరుగుతూ వచ్చింది. కాని ఎమ్మెల్యేలు తమ క్యాంపు కార్యాలయాల్లో వివిధ వర్గాలను కలుస్తున్నప్పుడు కిందిస్థాయి కేడర్ నుంచి కాస్తంత అసంతృప్తి వినిపించడం విశేషం. ప్రత్యేకించి గత ప్రభుత్వ హయాంలో అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా అప్పట్లో నియోజకవర్గాల వారీగా అనేక మందికి వివిధ హోదాల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చారు.

2019 నుంచి నిర్విఘ్నంగా ఐదేళ్లపాటు ఈ నియామకాలు జరుగుతూనే వచ్చాయి. కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో అయితే పారిశుధ్య కార్మికులు దగ్గర నుంచి ఇతరత్ర సూపర్‌వైజర్ల వరకు పెద్ద ఎత్తున నియామకాలు సాగాయి. అలాగే మిగతా విభాగాల్లోను ఎక్కడ అవసరమైతే అక్కడ అన్నట్టుగా కొందరికి ఉపాధి కల్పించారు. ఆనాడు ఎడాపెడా చేసిన నియామకాలు ఆపై వివాదాలకు దారితీశాయి. అయినప్పటికీ పెద్ద సంఖ్యలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు రావడంతో అనేక కుటుంబాలు గట్టెక్కిన దాఖలాలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టి ఉపాధి అవకాశాలు రెట్టింపవుతాయని, వాటిలో తమ పిల్లలకు చోటు దక్కుతుందని కూటమిలోని నేతలు ఆశ పెంచుకున్నారు. కాని ప్రత్యేకించి ఏ నియోజకవర్గంలోను ఏ ఒక్క నియామకం జరగడానికి వీల్లేనంత విధంగా తాజాగా రాష్ట్ర పరిధిలోనే ప్రతిష్టంభన నెలకొనడం అసంతృప్తిని పెంచింది.

### కాస్తంత చెయ్యండి బాబు ..

గత ప్రభుత్వంలో ఉన్న ఏపీ కార్పొరేషన్ ఫర్ సోర్స్ సర్వీసెస్ (ఆప్కోస్) ద్వారా నియామకాలు జరిగినట్టుగానే కూటమి ప్రభుత్వ హయాంలో నియామకాలు జరిగితే తమకు అంతోఇంతో కలిసొస్తుందన్న టీడీపీ నేతల వాదనలు మరింత బలపడుతున్నాయి. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేలను కలిసినప్పుడు పదేపదే చెబుతున్నారు. ఈ మేరకు పెద్ద ఎత్తున వినతులు చేతికి అందడం, ఇంకోవైపు నియోజకవర్గ స్థాయిలో పలానా కుటుంబానికి అవుట్ సోర్సింగ్‌లో అవకాశం కల్పించి ఆదుకోవాలంటూ సీనియర్లు చేస్తున్న ఒత్తిళ్ళతో ఎమ్మెల్యేలు దాదాపు విలవిలలాడుతున్నారు. ఎందుకంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగాలు ఇచ్చేందుకు ఉన్న పరిస్థితులపై ఇంకా అధ్యయనంలోనే ఉంది. స్థానికంగా పేరుకుపోయిన సమస్యలు ఒకవైపు పీడిస్తుంటే, అధికారుల తీరు ఇంకో రకంగా, కేడర్ తీరు మరో రకంగా ఉండడం కొత్తగా సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెంచేలా చేసింది.

### లోకేశ్ దృష్టికి అంతా..

నియోజకవర్గాల్లో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. సాధ్యమైనంత మేర ప్రభుత్వంతోపాటు తాము ఇరకాటంలో పడకుండా ముందస్తుగా ఎక్కడికక్కడ ఉపాధి విషయంలో బహిరంగ హామీలు ఇవ్వకుండా ఎమ్మెల్యేలు జాగ్రత్త పడుతూ వచ్చారు. అయితే రానురాను ఒత్తిళ్ళు మరింత పెరుగుతుండడంతో ఆప్కోస్ కార్పొరేషన్ ద్వారా నియామకాలు జరిగేలా చూడాలన్న డిమాండ్‌ను కచ్చితంగా సీఎం వరకు తీసుకువెళ్ళాలనే నిర్ణయంలో ఉన్నారు. ఇప్పటికే ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రితో పాటు మరికొందరి దృష్టికి ఈ విషయాన్ని పదేపదే తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితు ల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు వస్తే కొంత ఉపాధి అవకాశా లు మెరుగు పడతా యని, ఈలోపే వుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా మరికొన్ని అవకాశాలు దక్కితే కార్యకర్తల కుటుంబాల్లో విద్యావంతులకి అవకాశం ఇచ్చినట్టు అవుతుందన్న వాదనే అన్ని చోట్ల వినిపిస్తోంది.

## దేవాలయ భూముల పరిరక్షణకు సమష్టి కృషి : కలెక్టర్

ఏలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దేవాలయ భూముల పరిరక్షణకు యంత్రాంగ మంతా సమష్టి కృషి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖ అధికారులతో భూ పరిరక్షణ కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవడం, లీజుదారుల నుంచి లీజు మొత్తాలను వసూలు చేయడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లాలో 25 మండలాల్లో దేవాదాయశాఖకు చెందిన భూము లను మండలాల వారీగా సమగ్ర నివేదికను తయారు చేసి ఈ నెల 24వ తేదీలోగా వివరాలను సమర్పించాలని ఆదేశించారు. జేసీ ధాత్రిరెడ్డి, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీఆర్వో విశ్వేశ్వర రావు, దేవదాయశాఖ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హరి సూర్యప్రకాష్, ఆర్డీవోలు అచ్యుత అంబ రీష్, లాండ్స్ సర్వేశాఖ ఏడీ ఎస్‌హెచ్‌ఎండీ అన్సారీ, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, వివిధ దేవాలయాలు ఈవోలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



దేవాలయ భూముల పరిరక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, పక్కనే జేసీ ధాత్రిరెడ్డి

### అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి : జేసీ

జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో, భూముల రీసర్వే గ్రామసభల్లో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జేసీ ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ రెవెన్యూ అంశాలపై డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో జేసీ బుధవారం సమీక్షించారు.



# నూజివీడు ఏఎంసీ.. అభివృద్ధి బాట పట్టేనా?

- రాజకీయ కారణాలతో మూడు దఫాలుగా చివరి ఆరునెలల్లో ఏఎంసీ పదవుల భర్తీ
- మామిడి మార్కెట్‌గా అభివృద్ధి చేస్తామని కూటమి హామీ
- ఎన్నో ఆశలతో రైతులు

నూజివీడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల చరిత్ర కలిగిన నూజివీడు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అభివృద్ధిలో నానాటికీ దిగజారిపోతోంది. ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పదవీ కాలం చివరిలో ప్రకటిస్తుండడంతో రైతులకు అందుతున్న ప్రయోజనాలు శూన్యం. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం నూజివీడు మార్కెట్ యార్డు కేంద్రంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతుల్లో ఏఎంసీ అభివృద్ధిపై ఆశలు రేకెత్తిస్తోంది. ఎమ్మెల్యే, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఇప్పటికే రెండు పర్యాయాలు మామిడి వ్యాపారస్తులు, రైతులు, ఉద్యాన వనశాఖ అధికారులతో సమీక్ష ఏర్పాటు చేసి మామిడి మార్కెట్ ఏర్పాటు దిశగా అడుగులు పడేలా చేశారు. మార్కెట్ యార్డును మామిడి మార్కెట్‌గా అభివృద్ధి పరచడం అనేది కొత్త హామీ ఏమీ కాదు. దివంగత మాజీ ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావు కోరిక మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నూజివీడు ఏఎంసీని మామిడి మార్కెట్‌గా ఏర్పాటు చేస్తామని అప్పట్లో నూజివీడు వచ్చిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ నెరవేరలేదు. త్వరలోనే మామిడి సీజన్ ప్రారంభం కానుంది. ఈ సీజన్‌కు నూజివీడు కేంద్రంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేసి ఢిల్లీ, కోల్‌కత్తా, ముంబై, అమరావతి (మహారాష్ట్ర) వంటి ప్రాంతాల నుంచి మామిడి కొనుగోలుదారు లను రప్పించి కొనుగోళ్లు చేయిస్తే ఈ మార్కెట్ యార్డు దశ తిరిగే అవకాశాలు లేకపోలేదు.

### గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం

నూజివీడు మార్కెట్‌యార్డుపై గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరిని అవలంబించింది. ఈ యార్డు కేంద్రంగా జీవాల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామ ని ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు సరికదా యార్డు ప్రాంగణం ఇసుక డంపింగ్ యార్డుగా ఉపయోగపడింది. యార్డులోని గొడౌన్‌లు ఏదోఒక ప్రైవేట్ కంపెనీకి లీజుకు ఉపయోగపడ్డాయే తప్ప రైతులకు ఉప యోగంలోకి రాలేదు.

### అలంకార ప్రాయం.. చైర్మన్ పదవి

నియోజకవర్గ స్థాయి పదవి అయిన ఏఎంసీ చైర్మన్ పదవిని ముందస్తుగా ఇస్తే తమకెక్కడ రాజకీయ ప్రత్యర్థులు అవుతారో అనే కోణంతో గత ఇరవై ఏళ్లుగా ఇక్కడ అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు ఈ నామినేటెడ్ పదవిని చివరి దశవరకు భర్తీ చేయకుండా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా నియోజకవర్గ పరిధిలో ఏఎంసీ ద్వారా అందించాల్సిన అనేక ప్రభుత్వ పథకాలు రైతులకు అందుబాటులోకి రాలేదు. కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో చివరి ఆరునెలల్లో ఏఎంసీ పదవిని అక్కినేని చిట్టిబాబుకు ఇవ్వగా, అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో సైతం నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్ వర్సెస్ ఏలూరు ఎంపీల మధ్య రాజకీయ వార్ సాగి చివరి ఆరునెలల్లో కాపా శ్రీనివాసరావుకు చైర్మన్ పదవి వచ్చింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో చైర్మన్ పదవిని ఎస్సీలకు రిజర్వు చేయగా, ఎన్నికల కోడ్‌కు నెలరోజుల ముందు ముసునూరు మండలానికి చెందిన రాణికి పదవి ఇవ్వగా, అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆమెకు కూడా ఈ పదవి మూడున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.

### మ్యాంగో హబ్‌ను వినియోగంలోకి తేవాలి

నూజివీడు ఏఎంసీని మామిడి మార్కెట్‌గా ఏర్పాటు చేయడంతోనే మామిడి రైతుల సమస్యలు పరిష్కారం కావు. మార్కెట్ యార్డు పక్కనే ఉన్న ఇంటిగ్రేటెడ్ మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్ (మ్యాంగో హబ్)ను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చి గన్నవరం విమానాశ్రయ కేంద్రంగా విదేశాలకు మామిడి ఎగుమతులను ప్రారంభించడంతో పాటు నూజివీడు రైల్వేస్టేషన్ నుంచి (హనుమాన్ జంక్షన్ రైల్వేస్టేషన్) గతంలో నడిచిన గూడ్స్ ర్యాక్‌లను తిరిగి రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మామిడి మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలోకి నడిపించవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

# పదవుల 'పరపతి'కి యత్నం

- సహకార సంఘాల త్రిసభ్య కమిటీల పదవులకు కూటమి నేతల ప్రయత్నాలు
- టీడీపీలోనే ఆశావహులు ఎక్కువ
- నెలాఖరుకు కొలిక్కి వచ్చే అవకాశం

ఏలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (పీఏఎస్) ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు లేకపోవడంతో త్రి సభ్య కమిటీలతో పర్యవేక్షణకు రంగం సిద్ధం అవుతోంది. పాలక వర్గాలు లేకపోవడంతో ఆరు నెలల పాటు త్రిసభ్య కమిటీలతో సొసైటీలను నడపాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై నియోజకవర్గాల్లో జాబితాలు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వంలోని పెద్దలు పార్టీకి సంకేతాలు ఇవ్వడంతో వారి జాబితాలపై కసరత్తు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 159 పీఏఎస్‌ల్లో పదవులు దక్కించుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. తమనే సొసైటీ చైర్మన్‌గా నియమించాలని ముఖ్య నేతలపై ఒత్తిడి తెస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎవరికి వారే ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నారు.

> **ఎటువంటి ఉత్తర్వులు రాలేదు**
>
> 
>
> జిల్లాలో త్రిసభ్య కమిటీల ఏర్పాటు విషయమై ప్రభుత్వ ఉత్తర్వులు రాలేదు. వస్తే ప్రభుత్వ జీవో ప్రకారం చట్టం ప్రకారం ఈ నియామకాలను చేస్తాం. సొసైటీల్లోని ఉద్యోగులే పర్సన్ ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే మేము నడుచుకొంటాం.
>
> - అరిమిల్లి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి

### 12 ఏళ్ల క్రితం చివరిసారిగా...

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చివరగా 2013 జనవరి ఎన్నికలు జరిగాయి. 2018లో పదవీకాలం ముగియగా, అప్పట్లో ఎన్నికలు నిర్వహించలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను తెరపైకి తీసుకొచ్చింది. గతేడాది జూలై నెలాఖరుతో వీరి పదవీకాలం ముగిసింది. ఆపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పర్సన్ ఇన్‌చార్జులను నియమించింది. పాలకవర్గం గడువు ముగిసి ఏడేళ్లు అవుతున్నా.. అటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు, ఇటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రెగ్యులర్ పాలకవర్గాలు లేవు. ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జులతోనే సహకార సంఘాలను నెట్టుకొస్తున్నారు. వైసీపీ హయాంలో త్రిసభ్య కమిటీలు ఇష్టారాజ్యంగా పరిపాలన చేయడంతో పలు సొసైటీల పరిధిలో రైతులు నష్టపోయారు. అవకతవకలు, ఇతరత్రా లోటుపాట్లతో అధికారులూ అష్టకష్టాలు పడ్డారు.

### జిల్లాస్థాయిలోనే కమిటీలు

జిల్లా సహకార కేంద్ర బ్యాం కు, డీసీఎంఎస్ సొసైటీలకు ఏడుగురు సభ్యులకు తక్కువ కాకుండా సెవెన్ మెన్ కమిటీలను నియ మించుకునే అవకాశం ఉంది. ఈ సంఖ్య పెం చడం, తగ్గించడం అనేది ప్రభుత్వం నిర్ణయంపైనే ఆధార పడి ఉంది. డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు జేసీ ధాత్రిరెడ్డి స్పెషలా ఫీసర్‌గా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించిన వారికే కీలక డీసీసీబీ పదవి వరించే అవకాశం ఉంది. నియోజకవర్గాల్లో గత సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసి న వారికి సహకార సొసైటీల డైరెక్టర్లు, చైర్మన్‌లు, నియ మించే ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిందని చెబుతున్నారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేల నుంచి జిల్లా సహకార అధికారి కార్యాలయానికి, పార్టీ అధిష్ఠానానికి కొన్ని నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు అందాయి.

కట్నం వేధింపుల కేసులో నకిలీ జడ్జి అరెస్టు
అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య
7
జిల్లా ప్రధాన న్యాయమూర్తి బదిలీ
- మెయిన్‌లో..

# రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

ఏలూరు సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చింది.. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తారని, తమ రేషన్ కష్టాలు తీరినట్లేనని అందరూ భావించారు. అయితే ఇప్పటికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. ఇటీవల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగినా , ప్రభుత్వం నుంచి ఎటువంటి జీవో విడుదల కాలేదు. ఈ ఏడాదిలో పెళ్ళిళ్లు చేసుకున్న వారు, కార్డులలో మార్పులు, చేర్పులు, కొత్త కార్డుల కోసం మండలం, డివిజన్, జిల్లా స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నవారి రేషన్ కార్డులను సైతం తొలగించారు. జిల్లా వారీగా పరిశీలిస్తే సుమారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 4 వేల నుంచి 5వేల మంది వరకు కొత్త రేషన్ కార్డులు కోసం, కార్డులలో చేర్పులు, మార్పులు కోసం దరఖాస్తులు చేసుకున్నట్టు తెలుస్తోంది. కొత్త రేషన్ కార్డుల మంజూరులో త్వరలో రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. మార్గదర్శకాలు విడుద లైతే రేషన్ కార్డుల దరఖాస్తులను సచివాలయాల్లో అప్‌లోడ్ చేసే అవకాశాలు కనిపిస్తు న్నాయి. జిల్లాలో మొత్తం రేషన్ కార్డులు 6,31,051 వరకు ఉన్నాయి. మొత్తం 1,123 వరకు రేషన్ డిపోలుండగా, 395 ఎండీయూ ఆపరేటర్ల ద్వారా చౌకడిపోల నుంచి నిత్యావసర సరుకులు సరఫరా జరుగుతోంది. కొత్త రేషన్ కార్డులు మంజూరు అయితే ఈ కార్డుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి.



వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్ వద్ద మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీలు

## జేఈఈ మెయిన్‌కు 15 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు ఎన్టీయే నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జేఈఈలో కఠిన నిబంధనలను అమల్లోకి తెచ్చారు. పరీక్షలకు ఎంపిక చేసిన కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులేవీ పనిచేయకుండా జామర్ల ఏర్పాటు చేశారు. ప్రతీ అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించారు. పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందే ప్రధాన ద్వారాన్ని మూసివేస్తామని పలుమార్లు ప్రకటించడంతో పాటు, అడ్మిట్ కార్డులో స్పష్టంగా ముద్రించినప్పటికీ, ఇతర ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవడంలో కొన్ని నిమిషాలు ఆలస్యమై పలువురు అభ్యర్థులు పరీక్షకు దూరమయ్యారు. ఏలూ రు సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రం వద్ద ఇటువంటి ఘటన ఒకటి చోటు చేసుకుంది. నగర శివార్లలోని మార్కెట్ యార్డు వి.వి.నగర్‌కు చెందిన డి.శరణ్య అనే విద్యార్థిని ఆటోలో పరీక్ష కేంద్రానికి చేరుకునేసరికి ఎన్టీయే విధించిన 'గేట్ క్లోజ్ టైం' ఉదయం 8.30 గంటలు ముగిసింది. నిర్ణీత సమ యం కంటే పది నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ఆ విద్యార్థిని, ఆమె తల్లి ఎంత వేడుకున్నా లోపలికి అనుమతించకపోవడంతో కన్నీటిపర్యంతమై వెనుదిరిగింది. తొలిరోజు పరీక్షలకు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు కేంద్రా నికి ఉదయం, మధ్యాహ్నం సెషన్లకు 180 మంది వంతున అభ్యర్థులను కేటాయించగా 175, 177 మంది చొప్పున హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజ నీరింగ్ కళాశాల కేంద్రానికి ఉదయం సెషన్‌కు 102 మంది అభ్యర్థులకు 99 మంది, మధ్యాహ్నం 104 మందికి 100 మంది హాజరయ్యారు. మొత్తంమీద 15 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు, సాంకేతిక సమస్యలు తలెత్తలేదని నిర్వాహకులు తెలిపారు.



పరీక్ష కేంద్రానికి పది నిమిషాలు ఆలస్యంగా చేరుకున్న విద్యార్థిని



# తెల్లబంగారం వెలవెల

**ధర లేక కుదేలైన పత్తి రైతులు**
**చేలల్లోనే పంట వదిలివేస్తున్న వైనం**
**వ్యాపారులు సిండికేట్..**
**వారు నిర్ణయించిన ధరలకే అమ్మాలి**
**అప్పులు పాలవుతున్న రైతులు**

బుట్టాయగూడెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు సిరులు కురిపించిన పత్తి పంట నేడు ధరలు లేక వెలవెలబోతున్నది. తెల్లబంగారంగా పిలవబడుతూ సిరులు కురిపించిన పత్తిపంటకు నేడు కనీసం కూలిరేట్లు కూడా రాకపోవడంతో రైతులు సాగుచేసిన పంటను చేలల్లోనే వదిలి వేస్తున్న పరిస్థితి. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను అదుపులో ఉంచుకుని రైతులను నిలువునా ముంచుతున్నారంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులు గిట్టుబాటు ధరలకు కొనరు. బయట నుంచి వచ్చిన వ్యాపారులు ఎవరైనా ధరలు పెంచితే ఊరుకోరు. అమ్మ పెట్టదు అడుక్కు తిన నివ్వదు అన్నట్లుగా ఉంది వీరి తీరు. ఎకరాకు 20 నుంచి 25 వేల రూపాయల వరకు నష్టపోతు న్నామని రైతులు తెలియ జేస్తున్నారు. ధరలు పెంచమని వ్యాపారులను అడిగినా ప్రయోజనం ఉండటం లేదని, పంటలో నాణ్యత లేదని ధరలను మరింతగా దిగ జారుస్తున్నారని వాపోతున్నారు. వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ సొంత కాటాల్లో పంటను కొంటూ తూకాల్లోను మోసాలకు పాల్ప డుతున్నట్లు రైతులు గగ్గోలు పెడుతున్నారు.అప్పులు చేసి పంటను సాగుచేసిన రైతులు వడ్డీలు పెరుగు తుండటంతో వచ్చినకాడికి పంటను అమ్మి అప్పులు తీరుస్తున్నామని వాపోతున్నారు. వ్యాపారులు సన్న, చిన్నకారు రైతులకు ముందుగానే పెట్టుబడులు పెట్టి తర్వాత తాము నిర్ణయించిన ధరలకే పంటను కొనుగోలు చేస్తారు. నూటికి మూడు రూపాయలకు పైగానే వడ్డీ వసూలు చేస్తున్నారని అప్పులు తీసుకున్న రైతులు చెబుతున్నారు. తక్కువ ధరలకు పంటను అమ్మడం ఇష్టంలేని రైతులు పంటను ఇళ్ళలో దాచి ఉంచారు.

**అధికులు గిరిజన రైతులే**

మండలంలో అధికారుల లెక్కల ప్రకారం 654 ఎకరాల్లో పత్తిపంటను సాగుచేయగా అధికులు గిరిజన రైతులే ఉన్నారు. ధరలపై ఎంతో ఆశతో పంటను సాగుచేసిన రైతులకు చివరకు నిరాశే మిగులుతోంది. వ్యాపారులు పెట్టుబడులు పెడతారు. రైతుల నుంచి నూటికి 3 నుంచి 3.50 రూపాయల వరకు వడ్డీని వసూలు చేస్తారు. తీరా పంట చేతికి వచ్చాక వారు చెప్పిన ధరలకే పంట అమ్మాలంటారు. వేరేవారు కొంటామంటే ఊరుకోరు. గత్యంతరం లేక వ్యాపారులు చెప్పిన ధరలకే పంట అమ్ముకుని నష్టపోవాల్సి వస్తుంది.

**సిండికేట్ అయి దోపిడీ**

పత్తి పంటను కొనుగోలుచేసే వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను తొక్కి పెడుతున్నారని గిరిజన రైతులు వాపోతున్నారు.క్వింటా పత్తిని స్థానిక వ్యాపారులు 6,200 నుంచి 6,500 రూపా యల వరకు కొనుగోలు చేస్తుంటే తెలంగాణ ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు 7500 రూపాయల వరకు కొంటున్నారని వారిని స్థానిక వ్యాపారులు అడ్డుకుంటు న్నారని తెలియజేస్తున్నారు. దీంతో బయట ప్రాంతాల వ్యాపారులు గ్రామాలకు రావడం లేదని వాపోతున్నారు.

**తూకాల్లో మోసాలు**

పంటను కొనుగోలు చేసేటపుడు వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు రైతులు తెలియజేస్తున్నారు. కాటాలను ఫోన్ ద్వారా కూడా కంట్రోల్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. క్వింటా పత్తిని అమ్మితే 5 నుంచి 7 కేజీల వరకు మోసపోవడం జరుగుతుందని వాపోయారు. తాము తెచ్చిన కాటాలపై పంటను కొనుగోలు చేయరని అలా చేయాలంటే ధరల్లో తేడాలు ఉంటాయని వ్యాపారుల కాటాలపైన మరో ధర ఉంటుందని తెలిపారు. పెట్టుబడులు పెట్టడంతో వారి మాట కాదనలేక అమ్మకాలు జరుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.35 వేలు నష్టపోయా..**



నాలుగు ఎకరాల్లో పత్తిపంట సాగు చేశాను. వాతావరణ పరిస్థితులు దృష్ట్యా 2 ఎకరాల్లో పంట ఎండిపోయింది. మిగిలిన రెండు ఎకరాల్లో ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.25 నుంచి 35 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం క్వింటా రూ.6200 నుంచి రూ.6500 వరకు కొంటున్నారు. రెండు ఎకరాల్లో 6 క్వింటాళ్ళ పంట రాగా 70 వేల వరకు పెట్టుబడి పెట్టాను. చివరకు 35 వేల వరకు అప్పులపాలయ్యా. సత్తుపల్లి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రూ.7500 వరకు కొనుగోలు చేస్తున్నారు.

**కొవ్వాసి వెంకటేశ్వరావు, రైతు, అంతర్వేదిగూడెం**

# కొబ్బరి కళకళ..



**కొబ్బరి రైతులకు సిరుల పంట**
**ఊపందుకున్న దేశీయ ఎగుమతులు**
**ఉత్తరాదిన నూనె కంపెనీల నుంచి డిమాండ్**
**తమిళనాడులో తగ్గిన దిగుబడి**
**ధరలు మరింత పెరిగే అవకాశం**

పాలకొల్లు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కొబ్బరి ధరలు రైతు మోములో ఆనందం నింపుతున్నాయి. పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో రైతువారీ కొనుగోలు ధరలు వెయ్యి కాయలు రూ.12 నుంచి 13 వేలు ఉండగా పాత తూర్పుగోదావరి జిల్లాలో వెయ్యి కాయలు ధర రూ.15 నుంచి 16 వేలు ఉంది. దిగుబడి సైతం ఆశించిన మేర ఉండటంతో కొబ్బరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా గత మూడేళ్లలో కొబ్బరి మార్కెట్ ఒడిదుడుకులు ఎదుర్కొంది. ఒక దశలో ధరలు పతనమై కొబ్బరి తోటలు ఉనికికే ప్రమాదం ఏర్పడు తుందని అంచనా వేశారు. అయితే 2024 జులై నుంచి ధరలు పెరుగుతూ వచ్చాయి.

**ఇతర దేశాలు,రాష్ట్రాలకు ఎగుమతులు**

తమిళనాడులో కొబ్బరి దిగుమతులు మందగించాయని వర్తకులు చెబుతున్నారు. కేరళ, కర్ణాటక ప్రాంతాల కొబ్బరితో పోలిస్తే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో కొబ్బరికి నాణ్యత ఉంది. ఈ ప్రాంత కొబ్బరి కాయలు నిల్వకు ఆగడమే కాకుండా ఎండు కొబ్బరి దిగుబడి అధికంగా వస్తుంది. తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలలో అటకపై నిల్వవేసిన కొబ్బరి కాయలు ఏడాది పాటు పాడవ్వకుండా ఉంటాయి. దీంతో ఉభయగోదావరి జిల్లాలు నుంచి దేశీయంగా కొబ్బరి ఎగుమతులు ఊపందు కున్నాయి. కురిడీ కొబ్బరి కాయలు చైనాకు ఎగుమతి అవుతున్నాయి. ముదుపెన్నడూ లేని విధంగా గండేరా కురిడీ కొబ్బరికాయలు రూ.22 వేలు ఉంది. కురిడీలో రెండవ రకం (గడ్డగడ్డ) కాయలు రూ. 19 వేలు ఉంది. డిల్లీ క్వాలిటీ పచ్చి కొబ్బరి ఎగుమతి ధర వెయ్యి 19 వేలు ఉండగా 70-80 బత్తీల ధర రూ.13 వేలు ఉంది. నెంబరు కాయ (చిన్నకాయ) రూ.11 వేలు ఉంది. రిటైల్ మార్కెట్‌లో 28 సైజు ఒక కాయ రూ.28 ధర పలుకుతోంది.

**ఉగాది నాటికి ధరలు పెరిగే అవకాశం**

చైనాతో పాటు ఇతర దేశాలకు కొబ్బరి ఎగుమతులు ఊహించిన స్థాయి కంటే పెరగగా దేశీ యంగానూ డిమాండ్ పెరగడంతో వచ్చే ఉగాది నాటికి ధరలు మరింతగా పెరుగుతాయని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పలు ఉత్తరాది కోకోనట్ ఆయిల్ కంపెనీలు రోజుకి 5 వందలు టన్నుల ఎండు కొబ్బరిని కొనుగోలు చేస్తున్నాయి. కొబ్బరి నూనెను తల నూనెగా వాడటమే కాకుండా కేరళ దక్షిణాది ప్రాంతాలతో పాటు పలు ఉత్తరాధి ప్రాంతాల్లో తాజా కొబ్బరి నూనెను వంట నూనెగా వినియోగిస్తున్నారు. వంట నూనెల ధరలు సలసలా కాగుతున్న పరిస్థితుల్లో కొబ్బరి నూనె వినియోగం పెరిగిందని చెబుతున్నారు. ఎండుకొబ్బరిని పలు పిండి వంటలతో పాటు వంటల తయారీలోనూ వినియోగిస్తారు. దక్షాణాదిలో కొబ్బరి చట్నీలకు, ఉత్తరాధిలో కొన్ని రకాల కర్రీలు తయారు చేస్తారు. ఉభయగోదావరి జిల్లాలలో కొబ్బరికి పూర్వ వైభవం వస్తుందని రైతులు బావిస్తున్నారు. మొన్నటి వరకూ కొబ్బరి తోటలను తొలగిస్తూ వస్తున్న రైతులు ఇప్పుడు కొబ్బరి సాగుపై మక్కువ చూపిస్తున్నారు. వచ్చే రెండు, మూడు నెలల్లో రైతువారీ కొబ్బరి ధరలు వెయ్యి కాయలు రూ.18 వేలకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

**• ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలి**



కొబ్బరి రైతులకు కేరళ, తమిళనాడు తరహాలో ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందచేస్తే కొబ్బరి సాగు విస్తీర్ణం పెరుగుతుంది. గత దశాబ్ద కాలంలో జిల్లాలో కొబ్బరి సాగు విస్తీర్ణం మనసీయంగా తగ్గింది. దింపు కార్మికుల కొరత, మరో వైపు తెగుళ్ల బెడద,కిట్టుబాటు ధర లేకపోవడంతో కొబ్బరి రైతులు నిరుత్సాహంగా ఉన్నారు. ప్రభుత్వం సబ్సీడీపై ఎరువులు అందించడంతో పాటు హైబ్రిడ్ కొబ్బరి మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుంది.లేదంటే 2030 నాటికి కొబ్బరికాయ చెట్టు వద్దే రూ.30 అమ్మినా ఆశ్చర్యపోనక్కరలేదు.

**మైగాపుల రాంబాబు, కొబ్బరి వర్తకుడు, మట్టపర్రు**

## ఉత్సాహంగా అపుస్మా క్రీడాపోటీలు



క్రీడాజ్యోతితో అపుస్మా సభ్యులు

ఏలూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఏలూరుజోన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతా రామరాజు స్టేడి యంలో బుధవారం, గేమ్స్, స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహిం చారు.క్రీడాపోటీలను ఏలూరు జోన్ అధ్యక్షుడు కె.వెంక టేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. స్పోర్ట్స్‌మీట్‌ను శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత అపుస్మా, రాష్ట్ర జనరల్ కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, రీజనల్ అధ్యక్షుడు గున్నం బుల్లబ్బాయ్ క్రీడా సంబరాలను క్రీడా జ్యోతితో వెలిగించి ప్రారంభించారు. ఏలూరు జోన్ పిఎస్టీలు, కె.వి.ఆర్.సతీష్, కె.శేఖర్లు మాట్లాడారు. అపుస్మా ప్రైవేట్‌స్కూల్ నుంచి 30 స్కూళ్ళు, 2 వేలమంది విద్యార్థులతో జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను రెండురోజులు నిర్వహించటం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడాపోటీలను నిర్వహించారు. కె.చంద్రశేఖర్‌రావు, కడియాల విజయలక్ష్మి, ఎస్.ఆర్.కె ప్రసాద్, కె.వినోద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఎస్ఆర్‌కెఆర్‌లో జాతీయ గో-కార్ట్ పోటీలు

భీమవరం రూరల్, జనవరి 22 (ఆంధ్ర జ్యోతి) : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జాతీయ స్థాయిలో ఎస్ఆర్‌కెఆర్ గో-కార్ట్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీ కృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు బుధ వారం విడుదల చేశారు. మెకానికల్ ఇంజనీ రింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్‌బాబు మాట్లా డుతూ జాతీయస్థాయిలో జరిగే ఈ పోటీలను గురువారం ఉదయం కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ప్రారంభిస్తారని చెప్పారు.

ఇప్పటికే పోటీల్లో పాల్గొనేందుకు పలు ఇంజ నీరింగ్ కళాశాలల నుంచి బృందాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయన్నారు. పోటీల్లో విజేతలకు రూ. 3 లక్షల వరకు బహుమతులు అందించను న్నట్లు చెప్పారు. కో-ఆర్డినేటర్స్‌గా వ్యవహరిస్తు న్న అధ్యాపకులు మురళీకృష్ణమరాజు, ఎస్ఎస్‌కె వర్మ, డాక్టర్ ఐఆర్‌పీ వర్మ, రాజేంద్రప్రసాద్, వి ద్యార్థి బృందం పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ టెక్ జెట్ అధికారిక వెబ్‌సైట్ ప్రారంభం

నూజివీడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ నూజివీడు క్యాంపస్ పరిధిలో ప్రతి సంవత్సరం నిర్వహించే జాతీయస్థాయి సాంకేతి కోత్సవం టెక్‌జెట్ 25 అధికారిక వెబ్‌సైట్‌ను నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, డాక్టర్ అమరేంద్ర కుమార్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణాన్ని పెంపొందించటంలో టెక్‌జెట్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. దాదాపు 5 వేలమంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని, టెక్‌జెట్-25లో భాగంగా రోబోటిక్స్, కోడింగ్, హ్యాక్‌థాన్ తదితర అంశాలపై ప్రదర్శనలు ,ఆవిష్కరణలు జరుగు తాయన్నారు. విజేతలకు రూ.5 లక్షలు విలువైన ప్రైజ్‌మనీతో పాటు సర్టిఫికెట్‌లను ఇస్తామ న్నారు. సాంకేతిక నైపుణ్యాల ప్రదర్శనకు ఈ ఉత్సవాలు ఉపయోగపడతాయని చెప్పారు. ట్రిపుల్‌ఐటీ ఏవో డాక్టర్ లక్ష్మణరావు, జ్యోతిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఊరట



**ఇకపై కనీస వేతనం రూ.300**
**రోజువారీ పనిగంటల పెంపు**
**ప్రత్యేక కమిటీతో నిరంతర తనిఖీలు**

ఏలూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై రోజువారీ వేతనం రూ.300 ఖచ్చితంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయితే వేతన దారులు రోజుకు కనీసం 5 గంటలు పని చేయాల్సి ఉంటుంది. ఎంత సమయంలో ఏఏ పనులు చేపట్టారనే అంశాలను జిల్లాస్థాయిలో వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తోంది. సర్కార్ నిర్ణయంతో జాబ్ కార్డుదారులకు లబ్ధి చేకూరనుంది.

**బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట**

గత వైసీపీ ప్రభుత్వహయాంలో ఉపాధి హామీ పనుల్లో బోగస్ మస్తర్ల వ్యవ హారం సాగిందన్న ఆరోపణలు ఉన్నాయి. పనికి రాకపోయినా వారికి హాజరువేసి వేతనాలు స్వాహా చేశారు. ఈ అవినీతి, అక్రమాలు సామాజిక తనిఖీలు, గ్రామసభల్లో అనేక ప్రాంతాల్లో వెలుగు చూశాయి. వేతనదినాలు దుర్వినియోగం కావడంతో పనిచేసిన కూలీలకు పూర్తివేతనం అందలేదు. దీంతో ఉపాధిపనుల్లో అక్రమాలను అరికట్టడానికి జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ పనిచేసేలా నిబంధనల్లో మార్పు చేశారు. పనిప్రదేశాల గుర్తింపులో ముందుగా అంచనాలు రూపొందించాలి. నేలస్వభావం, కూలీలకు పనిచేసేందుకు అనువుగా ఉందా ? లేదా? అనేది గుర్తించాలి.

జిల్లాను యూనిట్‌గా తీసుకుని వేతనదారులకు పనులు కల్పించాలి. పనివేళల్లో మార్పులు చేయాలి. సాంకేతిక సహాయకులు నిత్యం పనులను పర్యవేక్షించాలి. ఎంపీడీవో, ఏపీడీ, ఏపీవోలు తప్పనిసరిగా మస్తర్లు తనిఖీ చేయాలి. పనివేళలు, కూలీలు చేసిన పనుల కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. పనివేళలు పెంచడంతో పాటు ఖచ్చి తంగా గిట్టుబాటు వేతనం అందించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని, ప్రస్తుతం ఏలూరు రూరల్ మండలంలో 15 గ్రామాల్లో పనులు జరుగు తున్నాయని, ఏపీవో హబీబ్ బాష తెలిపారు.







ఆసక్తిగా తిలకిస్తున్న మహిళలు

నాటకంలోని సన్నివేశాలు

## అలరించిన లవకుశ నాటకం

ఉండి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉండి మండలం కోలమూరులో సంతాన గోపాలస్వామి ఆలయంలో ముక్కోటి, ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా సురభి నాటకాలను ఏర్పాటు చేశారు. బుధవారం లవకుశ నాటకంను శ్రీవి నాయక నాట్యమండలి (సురభీ) బృందం వారిచే ప్రదర్శించారు. శ్రీరాముడి పట్టాభిషేకం, సీత మ్మను అనుమానించి అడవిలో వదిలి వేయడం, వాల్మీకి ఆశ్రమానికి చేరడం, లవ కుశల జననం వంటి సన్నివేశాల్లో కళాకారులు తమ నటనతో ఆసక్తి కలిగించారు. ప్రేక్షకులు చప్పట్లతో అభినందించారు. సెట్టింగ్‌లు, ఆర్ట్‌లు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వేణుగోపాలరావు దర్శకత్వంలో ప్రదర్శించిన ప్రదర్శనలు అందరిని ఆకట్టుకు న్నాయి. విపరీతమైన చలిలో కూడా ప్రేక్షకులు నాటకాలను వీక్షించేందుకు విచ్చేశారు. యువతీ యవకులు కూడా ఆసక్తిగా నాటకాలను తిల కించడం గమనార్హం.. ప్రజల ఆదరాభిమానాలు చూసి కళాకారులు మరీ ఉత్సాహంగా నటిం చారు. ఆలయకమిటీ చైర్మన్ నంబూరీ బదిరీ నారాయణరాజు, మంతెన రామరాజు, రుద్రరాజు రవికుమార్‌రాజు, పేరిచర్ల శ్రీనివాస రాజు, అప్పలరాజు, నంబూరి బలరామరాజు, నరసింహరాజు, కేవీ రాజు, ముదునూరి సతీష్ రాజు గ్రామపెద్దలు నాటకాల ఏర్పాట్లును పర్యవేక్షించారు.

## నేడు పోలవరం పరిశీలనకు జలవనరుల మంత్రి నిమ్మల

పోలవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు గురువారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు రానున్నారు. డయాఫ్రంవాల్ నిర్మా ణంలో ప్లాస్టిక్ కాంక్రీట్ వినియోగంపై రాష్ట్ర జలవనరుల శాఖ, కేంద్ర జలశక్తి సంఘం, విదేశీ నిపుణుల స్పష్టమైన నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో మంత్రి పర్యటన ఆసక్తి కరంగా మారింది. ఉదయం 10 గంటలకు పోలవరం ప్రాజెక్టుకి చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల వరకూ పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలిస్తారు. భోజనం అనంతరం 2.30 గంటలకు విజయవాడ వెళతారు.

## 26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేధ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ తెలిపారు. వివరాలకు 94903 36550 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



## చింపాంజీ వచ్చింది.. కోతులు పరార్..

**అన్నదాతల ఐడియా..**
**వేషంతో కోతుల బెడదకు చెక్**

కోతల బెడద నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకోటానికి రైతులకు ఒక ఐడియా వచ్చింది. గ్రామంలోని ఒక వ్యక్తికి చింపాంజీ వేషం వేసి చేలల్లో తిప్పుతున్నారు. చింపాంజీ వేషాన్ని చూసిన కోతులు కుయ్యో మొర్రో అంటూ ఆ ప్రాంతం వదిలి పరుగులు తీస్తున్నాయి. పోలవరం గ్రామంలో కొంత మంది రైతులకు వచ్చిన ఈ ఆలోచన మంచి ఫలితాలు ఇస్తున్నట్లు చెపుతున్నారు. మండలంలో రబీలో సుమారు 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు అయ్యింది. అన్ని గ్రామాల్లో మొక్కజొన్న రైతులు కోతుల బెడదతో తీవ్ర కష్ట నష్టాలను ఎదుర్కొంటున్నారు. కోతుల మందలు మొక్కజొన్న చేలలో పడి కండెలు విరిచి పంట ధ్వంసం చేస్తున్నాయి. కోతులకు హాని తలపెట్టకూడదనే సెంటిమెంట్ వల్ల వాటి సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు ప్రజలు నరకయాతన పడుతున్నారు. కోతుల నుంచి పంట ఎలా కాపాడుకోవాలో రైతులకు దిక్కుతోచని పరిస్థితి.. కుటుంబాలు మొత్తం ఉదయం నుంచి పొద్దుకూకే వరకు మొక్కజొన్న పంటను కాపలా కాసుకుంటున్నారు. పోలవరం గ్రామంలో చింపాంజీ ఐడియాతో కోతులు పరారవుతుండడడంతో ఇప్పుడు రైతులందరూ తాము కూడా చింపాంజీ డ్రస్ తెచ్చుకొని కోతుల బెడద నుంచి పంటను కాపాడుకుంటామని అంటున్నారు.

-చాట్రాయి (ఆంధ్రజ్యోతి)

# క్యాంపస్ ఉష్..!

**ఉద్యోగ ఎంపికల్లో ఈసారీ నిరాశే..**
**ఇంజనీరింగ్ విద్యార్థులకు గడ్డుకాలం**
**ఉమ్మడి జిల్లాలో రెండేళ్లలో 18 వేల మందికిపైగా నిరుద్యోగులు**



భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ చదివే విద్యార్థుల సంఖ్య పెరిగింది. కానీ ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతూ వస్తున్నాయి. గత ఏడాదిలాగానే ఈ ఏడాది క్యాంపస్ ఎంపికలో విద్యార్థులకు నిరాశే మిగిలింది. వేలల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని విద్యార్థులు బయటకు వస్తుంటే వందలలోనే ఉద్యోగ అవకాశాలు ఉంటున్నాయి. దీంతో ఇంజనీరింగ్ నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతోంది. వారిలో నిరుత్సాహం నెలకొంటుంది. రానున్న రోజుల్లో సాఫ్ట్‌వేర్ రంగం ఇలానే ఉంటే ఆ కోర్సు పూర్తి చేసుకునే విద్యార్థుల పరిస్థితి ఏమిటనే ఆలోచన మొదలైంది.

**ఈ రెండేళ్లలో 18 వేల మంది నిరుద్యోగులు**

ఉమ్మడి జిల్లాలోని 15 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏడాదికి మేనేజ్‌మెంట్, కన్వీనర్ కోటాలో 11 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ చదువుతున్నారు. 2024 సంవత్సరంలో 9 వేల మంది విద్యార్థులకు పైగా బయటకు వచ్చారు. వారిలో వెయ్యి మందిలోపు విద్యార్థులకు మాత్రమే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యారు. 8 వేల మంది విద్యార్థులు బయట ఆన్‌లైన్ ఇంటర్వ్యూల్లో ఎంపికల కోసం కుస్తీ పడుతూ అతి తక్కువ మంది ఉద్యోగాలు సాధించగలుగుతున్నారు. ఇక 2025లో బయటకు వచ్చే ఇంజనీరింగ్ విద్యార్థుల బాచ్ ఈ జనవరి లోపులోనే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికై ఉండాలి. అలాంటిది ఈ బ్యాచ్ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు కళాశాలలకు కంపెనీలు పెద్దగా రాలేదు. వచ్చిన కొన్ని కంపెనీలు పదుల సంఖ్యలోనే ఎంపికలు చేసుకున్నారు. దీంతో ఈ ఏడాది ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు వందల సంఖ్యలోనే ఉద్యోగాలకు పరిమితమవ్వాల్సి వచ్చింది. ఈ లెక్కన ఈ రెండేళ్ళలోనే 18 వేల మందికిపైగా ఇంజనీరింగ్ పూర్తిచేసి నిరుద్యోగులుగా ఉన్నారు.





**కరోనా సమయంలోను ఉద్యోగాలు**

కరోనా ఉధృత సమయం అయిన 2020, 2021 సంవత్సరాల్లోను ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలను అందుకోగలిగారు. జిల్లాలో 9 వేల మంది వరకు ఇంజనీరింగ్ కోర్సు ఏడాదికి పూర్తి చేస్తే 3 వేలకు పైగా విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించారు. అది కూడా మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు వచ్చాయి. పేరొందిన ఇంజనీరింగ్ కళాశాలల్లో 50 శాతం పైగా విద్యార్థులకు క్యాంపస్ ఉద్యోగాలు అందించారు.

**2023 నుంచి సాఫ్ట్‌వేర్ స్లో**

2023 సంవత్సరం నుంచి సాఫ్ట్‌వేర్ రంగం స్లో అయ్యింది. పెద్ద కంపెనీలలో ప్రాజెక్టులు తగ్గుతూ రావడంతో ఉన్న ఉద్యోగులతో సరిపెట్టుకునే విధానంలోకి వచ్చేశారు. కొన్ని కంపెనీలు మాత్రమే కొంత వరకు కొత్త ఉద్యోగాలు ఇస్తూ వస్తున్నారు. దీంతో వేల ఉద్యోగ అవకాశాలు వందలుగా మారాయి. గతంలో కంపెనీ హెచ్‌వోడీలు వంటి వారి రికమెండేషన్‌లతో ఉద్యోగాలు కొత్త వారికి లభించేవి. ఆ విధానాలకు పూర్తిగా మూతపడింది.

**ఈ ఏడాది 90 శాతం సీట్లు భర్తీ**

రెండేళ్ళుగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు సరిగా లేకపోయినా ఇంజనీరింగ్ చదువుకునేవారి సంఖ్య పెరిగింది. 2023 విద్యా సంవత్సరంలో జిల్లాలో 70 శాతం పైగా కళాశాలల్లో సీట్లు భర్తీ అయ్యాయి. 2024 విద్యా సంవత్సరంలో 90 శాతం వరకు సీట్లు భర్తీ అయ్యాయి. డిగ్రీ కన్నా ఇంజనీరింగ్‌పైనే విద్యార్థులు మక్కువ చూపారు.

**• ప్రాజెక్టులు తగ్గిపోయాయి**

ఇంటర్నేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు పెద్ద ప్రాజెక్టులు రెండేళ్ళుగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం చిన్న ప్రాజెక్టులే ఉంటున్నాయి. అందువల్ల కొత్త వారిని తీసుకోవడానికి కంపెనీలకు వీలుకావడం లేదు.

**- శ్రీరామ్మూర్తి , సాఫ్ట్‌వేర్ ఉద్యోగి**

**• రెండేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నా**

మరో రెండు నెలలు గడిస్తే ఇంజనీరింగ్ పూర్తిచేసి రెండేళ్లవుతుంది. క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపిక చేయలేదు. ఆన్‌లైన్ ఇంటర్వ్యూలకు ఎన్ని అటెండ్ అయినా రిజెక్ట్ అవుతున్నాయి. రెండుసార్లు మూడు నెలల కంప్యూటర్ కోర్సులు చేశాను.ఇంకా ఉద్యోగం రాలేదు.

**- మనీష్ , ఇంజనీరింగ్ విద్యార్థి**



యలమంచిలిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల

## రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు

**మంత్రి నిమ్మల రామానాయుడు**

యలమంచిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల కాలంలో పాలకొల్లు నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో రూ.100కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. యలమంచిలి, ఊటాడ, అడవిపాలెం గ్రామాల్లో కోటి రూపాయలతో నిర్మించనున్న సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం శిలాఫలకాలను ఆవిష్కరించారు. మూడు గ్రామాల్లో కార్యక్రమాలకు మంత్రి రామానాయుడు స్వయంగా బైక్ నడుపుతూ ప్రజలను పలకరిస్తూ అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ ఏటిగట్టు పటిష్టతకు శాశ్వత చర్యలు చేపట్టి ఈ ప్రాంత ప్రజలను వరద ముంపు నుంచి కాపాడతామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. . గత ప్రభుత్వం గ్రామపంచాయతీల నిధులను కాజేసి సర్పంచులను భిక్షమెత్తుకునేలా చేస్తే.. నేటి కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులిచ్చి పంచాయతీ పాలకవర్గాలను తలెత్తుకునేలా చేసిందన్నారు. గత ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని రూ.16వేలకు తగ్గించిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే హెక్టారుకు ఇన్‌పుట్ సబ్సిడీని రూ.25వేలకు పెంచామన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు బర్రే మేరీ, బుడితి జయరాజు, ఎంపీటీసీ సభ్యురాలు చిలుకూరి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులతో మంత్రి సమావేశం

పాలకొల్లు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీలో అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులకు బుధవారం లయన్స్ క్లబ్‌హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో 150 మంది వరకు శిక్షణకు అభ్యర్థులు వస్తారని భావించి ఏర్పాట్లు చేయగా 600, 700 మంది వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి నిమ్మల తెలిపారు.

## ఆపన్నులకు కుల సంఘాలు అండగా ఉండాలి

**కార్మికశాఖ మంత్రి సుభాష్**



ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి సుభాష్

నరసాపురం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇతర కులస్థులతో సోదర భావంతో ఉంటూ కులంలో ఎవరికైనా ఇబ్బందులు వస్తే మేము ఉన్నామని కుల సంఘాలు భరోసాగా నిలవాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సీతారాంపురంలో శెట్టిబలిజ యువసేన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేన్సర్ రోగి వైద్యం కోసం సేకరించిన రూ.2.22 లక్షల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి అందించి మాట్లాడారు. మెడికల్ క్యాంపులు, చదువులో వెనుకబడిన, ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవార్ని ఆదుకునేందుకు యువత ముందుండాలన్నారు. విద్యతోనే గౌరవం వస్తుందని, అది మిగిలిన వారికి స్ఫూర్తిగా ఉంటుందన్నారు. గుబ్బల రాజేష్, గుత్తుల వాసు, పాలా రాంబాబు,కుక్కల శ్రీను, కుడిపూడి పాల్గొన్నారు

## 58 ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు జారీ

ఏలూరు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో రెండు రకాల స్కీంలలో కాంట్రాక్టు/అవుట్‌సోర్సింగ్ విధానాల్లో మొత్తం 58 ఉద్యోగ నియామకాలకు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని బుధవారం వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశారు. జాతీయ పట్టణ ఆరోగ్య పథకం(ఎన్‌యుహెచ్‌ఎం)కింద ఏడాది కాలపరిమితికి లోబడి కాంట్రాక్టు విధానంలో ఫార్మసిస్టు పోస్టులు 7, ల్యాబ్ టెక్నీషియన్ 1, అవుట్ సోర్సింగ్ విధానంలో డేటాఎంట్రీ ఆపరేటర్ 6, లాస్ట్‌గ్రేడ్ సర్వీస్ 4 పోస్టులు కలిపి మొత్తం 18 ఉద్యోగనియామకాలకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. వీటితోపాటు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో ఏడాది కాలపరిమితికి లోబడి కాంట్రాక్టు విధానంలో 10 ల్యాబ్ టెక్నీషియన్, అవుట్ సోర్సింగ్ విధానంలో 30 ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ పోస్టుల భర్తీకి కూడా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వివరించారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల వెబ్‌సైట్లలో పొందుపర్చిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని, విద్యార్హతలు, అన్ని సర్టిఫికెట్ల ఒక జిరాక్స్ సెట్‌ను జతచేసి, రూ.300లకు 'డీఎంహెచ్‌వో, ఏలూరుజిల్లా, ఏలూరు' పేరిట డిమాండ్ డ్రాఫ్టును తీసుకుని ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పోస్టుల సంఖ్య తగ్గించడం లేదా పెంచడానికి కలెక్టర్ అధ్యక్షతన గల జిల్లా నియామకపు కమిటీ (డీఎస్‌సి)కి పూర్తి అధికారం ఉందని స్పష్టం చేశారు.

## పేకాట క్లబ్‌ను మూయించాలని వినతి



కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్, గ్రామస్థులు

నరసాపురం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పేకాట క్లబ్ పై నరసాపురం మండలం సీతారాంపురం సౌత్ గ్రామస్థులు కథంతొక్కారు. సర్పంచ్ దొండపాటి వెంకట్, మాజీ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ పెండ్ర వీరన్న, మాజీ సర్పంచ్ అయ్యప్పనాయుడు, మాజీ ఎంపీటీసీ కొండేటి త్రినాథ్‌ల ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శనగా వెళ్లి కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కొంతకాలంగా గ్రామ సెంటర్‌లో యూత్‌క్లబ్ పేరిట జూదం నిర్వహిస్తున్నారు. ఇటీవల పండుగ సమయాల్లో ఈక్లబ్‌లో విచ్చలవిడిగా పేకాట జరిగిందని, మళ్లీ ఇక్కడ ఇటువంటి జూదం జరగకుండా శాశ్వతంగా మూయించి వేయాలంటూ గ్రామ కార్యదర్శికి గ్రామస్థులంతా విన్నవించారు. ఇటువంటి సంస్కృతి గ్రామంలో గతంలో ఎన్నడూ లేదని, యువత చెడుమార్గాలపై మళ్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. క్లబ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిపై కార్యదర్శి శ్రీనివాస్ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళతానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆకన ఏసు, జేవీఆర్, ఎం రమణ, ఎన్.వర్మ పాల్గొన్నారు.

## యలమంచిలి ఇన్‌చార్జి ఎంపీపీగా గొల్లపల్లి



యలమంచిలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి):యలమంచిలి ఇన్‌ఛార్జ్ ఎంపీపీగా గొల్లపల్లి శ్రీనివాసరావు ఈ నెల 24న బాధ్యతలు స్వీకరించనున్నట్టు ఎంపీడీవో ఎన్.ప్రేమాన్విత తెలిపారు. 2021లో జరిగిన ఎన్నికల్లో ఎంపీపీ స్థానాన్ని వైసీపీ పార్టీ కైవసం చేసుకోగా యలమంచిలి-2 ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, ఏనుగువానిలంక ఎంపీటీసీ వినుకొండ ధనలక్ష్మి చెరో రెండున్నరేళ్లు పంచుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. మొదటి రెండున్నరేళ్లు వెంకటరమణ బాధ్యతలు చేపట్టి 2024 మార్చిలో పదవికి రాజీనామా చేశారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ ఉండటం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నిక జరగలేదు. ఈ నేపథ్యంలో వైస్ ఎంపీపీ-1 శ్రీనివాసరావు ఇన్‌ఛార్జ్ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.



# మత్తుతో.. జీవితం చిత్తు!

- పశ్చిమను వదలని గంజాయి
- దాడులు శూన్యం..
- విద్యార్థులే లక్ష్యం



తాడేపల్లిగూడెం క్రైం జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా సంక్రాంతికి సరదాగా గడిపే యువతకు గంజాయి కూడా తోడైంది. ఏరులై పారిన మద్యం, సారాతో పాటు అంతకు మించిన మత్తు ఇచ్చే గంజాయి గుట్టుగా వాడుతున్నారనేది బహిరంగ రహస్యం. విద్యా కేంద్రాలు, ఐటీ విద్యార్థులే లక్ష్యంగా గంజాయి సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్‌ల ద్వారా కేజీల కొద్ది గంజాయి తరలి వస్తున్నది. కేజీ గంజాయికి రూ.25వేల నుంచి రూ.50వేల వరకూ ఇస్తున్నారంటే ఈ గంజాయి మత్తు ఏమేర ఉందో అర్థం చేసుకోవచ్చు.

- కొంత కాలం క్రితం తాడేపల్లిగూడెం ఏపీ నిట్ విద్యార్థులు బర్త్‌డే పార్టీ చేసుకుంటూ కారులో వెళ్తుండగా కారు పెదతాడేపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొట్టి ఆ కారు నడుపుతున్న ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ కారులో ఉన్న విద్యార్థులతోపాటు తాడేపల్లి గూడెంకు చెందిన యువకుడు గంజాయి సప్లయ్ చేసే వాడని గుసగుసలు వినిపించాయి.
- భీమవరంలోని ఓ కళాశాల సమీపంలో విద్యార్థులు గంజాయి తాగుతూ ఊగుతున్నారని తల్లిదండ్రులకు తెలిసి అక్కడకు వెళ్లి చూడగా వారి పిల్లలు గంజాయికి బానిసలయ్యారని గ్రహించి వారిని ఆ కళాశాల మాన్పించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చే పరిస్థితి ఏర్పడింది.
- తాడేపల్లిగూడెంకు చెందిన తాపి పనిచేసే నలుగురు యువకులు రాజమండ్రిలోని ఓ లాడ్జిలో గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వారి మూలాలు ఎక్కడ ఉన్నాయని విచారిస్తే వారు గంజాయిని క్రమం తప్పకుండా ఉపయోగిస్తున్నారని వారి ద్వారానే విద్యార్థులకు గంజాయి అందుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి.
- తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ సమీపంలోని ఎల్ అగ్రహారం ప్రాంతంలో ప్రతి వారం వీకెండ్‌లో విద్యార్థులు బయటకు వెళ్లి గంజాయితో ఎంజాయ్ చేస్తున్నారని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు. వారికి హైవే, రైల్వేస్టేషన్‌ల ద్వారా అరకు, పాడేరు. ఆంధ్రా ఒరిస్సా సరిహద్దుల్లో పండించిన గంజాయి ఇబ్బడి ముబ్బడిగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాటిపై పోలీస్ నిఘా పెట్టకపోగా దాడులు కూడా చేయడంలేదనేదనే ఆరోపణలు వస్తున్నాయి.

### రైళ్లలో తరలింపు..

గంజాయి సెల్‌ఫోన్ బాక్సుల్లో, కాలేజి బ్యాగుల్లో పెట్టుకుని కేజీలు కేజీలు రైలులోనే తరలిస్తున్నట్టు సమాచారం. పోలీసులకు, రైల్వే పోలీసులకు ఎలాంటి అనుమానం లేకుండా జనరల్ భోగీల్లో విశాఖ నుంచి రైలు బయల్దేరేందుకు కొన్ని క్షణాల ముందు ప్లాట్‌ఫాంకు చేరుకుని రన్నింగ్ ట్రెయిన్ ఎక్కి ఈ మత్తు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గంజాయి తరలించేవారు వారానికి నాలుగు రోజులు ఈ తరహా తరలింపు సాగుతున్నాయనేది బహిరంగ రహస్యం. ఈ తరహా గంజాయి తాడేపల్లిగూడెంతోపాటు, భీమవరం, తణుకు, నరసాపురం, ఆకివీడు తదితర ప్రాంతాల్లో గంజాయి గుప్పుమంటోంది.

## ఎందుకీ లింగ వ్యత్యాసం

**కాళ్లలో 1000 మంది పురుషులకు 804 మంది మహిళలు .. అధికారుల ఆరా**



కాళ్ళ పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యాధికారి డాక్టర్ సునీల్

కాళ్ళ జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ మండలంలో అసాధారణ రీతిలో వచ్చిన లింగ నిష్పత్తిలో వ్యత్యాసంపై అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 20న భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి అధికారులతో నిర్వహించిన సమావేశంలో గణాంకాల నివేదిక ప్రకారం కాళ్ళ మండలంలో లింగ నిష్పత్తిలో 1000 మంది పురుషులకు 804 మంది స్త్రీలు మాత్రమే ఉన్నట్లు అసాధారణ వ్యత్యాసం కనిపించింది. మహిళల సంఖ్య తగ్గడానికి కారణాలు ఏమిటనే దానిపై ఆరా తీస్తున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం లింగ నిష్పత్తి 1000 మందికి 993 ఉంది. 2011 ప్రకారం 1000 మందికి 997 ఉన్న నిష్పత్తి 804గా రావడంపై గర్భస్థ పిండ పరీక్షలు జరుగుతున్నాయా? ఆడపిల్లలను వద్దనుకుంటున్నారా? లేదా కాళ్ళ మండలంలో మగ పిల్లల జననాల సంఖ్య అధికంగా ఉందా, ఇతరత్రా కారణాలు ఇందుకు కారణమా.. ఇలా ఎన్నో ప్రశ్నలను అధికారులు చర్చించుకుంటున్నారు. కాళ్ళ పీహెచ్‌సీలో మండల వైద్యాధికారి డా. ఎస్.సునీల్‌కుమార్ బుధవారం వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. అదేవిధంగా గడిచిన ఏడాదిలో ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ప్రసవాల్లో ఆడ, మగ బిడ్డల సంఖ్యను తెలుసుకున్నారు.

## 25న ఛాంబర్స్‌లో మెగా జాబ్ మేళా



వివరాలు చెబుతున్న కళాశాల యాజమాన్యం

పాలకొల్లు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన మెగా జాబ్ మేళా (ఉద్యోగ దిక్సూచి) నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, పాలకవర్గ చైర్మన్ కేవీఆర్ నరసింహారావు తెలిపారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జాబ్‌మేళాకు ఐటీ కంపెనీలు, బ్యాంకింగ్ సెక్టార్లు, కెమికల్ ఇండస్ట్రీస్, లాబ్స్ తదితర కంపెనీలు 20నుంచి 25 వరకు వచ్చి ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు. సుమారుగా 1500 మందిని ఎంపిక చేయడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని ప్రాంతాల వారు హాజరు కావచ్చుని వారు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ,బీటెక్, పీజీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈమెగా జాబ్ మేళాను మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, కలెక్టర్ సి.నాగరాణి ప్రారంభిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 98497 12739, 99120 46234 ఫోన్‌లో సంప్రదించ వచ్చునని తెలిపారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ.. చిత్రంలో కలెక్టర్ నాగరాణి ఎమ్మెల్యే ఆరిమిల్లి

## తణుకు ఆస్పత్రి సమస్యలు పరిష్కరిస్తాం

తణుకు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో అన్ని మౌలిక సదుపాయల గురించి చర్చించడం జరిగిందని తణుకు జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటి చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం తణుకు జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆసుపత్రి సేవలు విషయంలో మూడవ స్థానంలో ఉందన్నారు. ఆసుపత్రికి కావాల్సిన సదుపాయాలు, సిబ్బంది కొరత వంటి విషయాలను తొందర్లోనే పరిష్కరిస్తామన్నారు. కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఇక్కడ ఆసుపత్రిలో భవనాలు కొరత, బ్లడ్ బ్యాంకు విషయంలో తక్కువ సమయంలోనే పరిష్కరించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. నియోజకవర్గానికి రూ.కోటి 50లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. దానిలో వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధిని వైసీపీ పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. జిల్లా ఆసుపత్రి స్థాయిలో ఐసీయూ, సిటీస్కాన్. ట్రామాకేర్ సెంటర్, ఎంఆర్‌ఐ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామన్నారు. బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేశామని, దానికి నిధులు కేటాయించామని త్వరలోనే అందరికి అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెలగల అరుణ పాల్గొన్నారు.

## శ్మశాన వాటికపై ఆందోళన విరమణ

తణుకు రూరల్, జనవరి 22, (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికలో చెట్ల తొలగింపులో ఏర్పడిన వివాదం బుధవారం అధికారుల జోక్యంతో సమసిపోయింది. మునిసిపల్ కమీషనర్ టి. రామ్ కుమార్ ఆందోళన కారులతో మాట్లాడారు. ఎస్సీ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష శిబిరం వద్దకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికను పూర్తి స్థాయిలో మునిసిపాలిటి నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆందోళన కారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని సీఐను కోరారు. దీనితో నిబంధనల ప్రకారం కేసులను పరిశీలించి ఎత్తివేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో బుధవారం నాడు ఆందోళనను విరమించారు.

## క్రైమ్ కార్నర్

### రైలు ఢీకొని వ్యవసాయ కూలీ మృతి



పైడిరాజు (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నవాబుపాలెం వద్ద రైల్వే ట్రాకు దాటుతుండగా పెంటపాడు మండలం ప్రత్తిపాడుకు చెందిన కూలి పెనుమాక పైడిరాజు (45) మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 20వ తేదీన రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడని రైల్వే పోలీసులు సమాచారంతో పేపర్‌లో పడిన వార్తల ఆధారంగా కుటుంబ సభ్యులు పైడిరాజుగా గుర్తించారు. పైడిరాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూలిపనులు చేసుకుని జీవించే పైడిరాజు పనికి వెళ్తుండగానే మృతి చెందడం కుటుంబ సభ్యులను శోకసంద్రంలో ముంచేసింది. జీఆర్‌పీ ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

భీమవరం క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఒకటవ పట్టణానికి చెందిన మైనర్ బాలిక ఈ నెల 17వ తేదీ నుంచి కనిపించకుండాపోవడంతో పోలీసులు చాకచక్యంగా కేసును ఛేదించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మొబైల్ లోకేషన్, ప్రత్యేక బృందాలు, ఇంటిలిజెన్స్ సమాచారంతో పాలకొల్లు బస్టాండ్ వద్ద ఉన్నట్లుగా గుర్తించారు. అనంతరం ఆ బాలికను భీమవరం తీసుకువచ్చి విచారించగా ఇంట్లో వారు పనుల కోసం బయటకు వెళ్ళిన సమయంలో ఒక వ్యక్తి పరిచయమయ్యాడని, ఆ యువకుడి మాటలు నమ్మి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయినట్లుగా తెలిపింది. తర్వాత ఆ యువకుడు నిర్బంధించాడని విచారణలో తేలింది. తల్లిదండ్రులు పిల్లలను అనుక్షణం పర్యవేక్షణ చేసుకోవాలని కంటికి రెప్పలా కాపాడుకోవాలని వన్‌టౌన్ సీఐ నాగరాజు సూచించారు.

## అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ప్రగడవరం గ్రామానికి చెందిన కొనకళ్ళ శ్రీనివాసరావు (39) భార్య లక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యవసాయం చేయడానికి అప్పుల పాలయ్యాడు. వీటిని తీర్చే మార్గం కానరాక ఈనెల 21వ తేదీ రాత్రి పురుగు మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

## కట్నం వేధింపుల కేసులో నకిలీ జడ్జి అరెస్టు





నిందితుడిని అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జడ్జినంటూ మోసం చేసి యువతిని పెళ్లి చేసుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ బుధవారం రాత్రి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ భగవతీనగర్‌కు చెందిన నామాల నరేందర్ (33) ఇతను ఒక మ్యాట్రిమోనీకి తన బయోడేటా పంపించారు. తాను జడ్జినని తెలంగాణలో పనిచేస్తున్నానని చెప్పి వివరాలు పెట్టాడు. ఏలూరు కొత్త పేటకు చెందిన సామంతుల నిర్మలకు 2019లో మేట్రిమోని ద్వారా అతను పరిచయం అయ్యాడు. ఆ పరిచయంతో పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడు. అయితే అతను జడ్జి అని చెప్పడంతో ఇరువురు కుటుంబ సభ్యులు మాట్లాడుకుని 2022లో రూ.75 లక్షలు కట్నం అడగగా రూ.25 లక్షలు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలం ఖమ్మంలో కాపురం పెట్టారు. ఆ తరువాత అతను అప్పటికే పలువురికి కోర్టులలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసగించడంతో తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, ఉప్పల్, చాందానగర్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదు కావడంతో అతనిని అరెస్టు చేశారు. అంతేకాకుండా నిర్మలను రూ.50 లక్షలు తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తున్నాడు. అతను జడ్జి కాదని తెలుసుకున్న నిర్మల గత నెల నవంబర్ 12న ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కాంతి ప్రియ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నామాల నరేందర్ పోలీసులకు చిక్కకుండా పరీరాలో ఉన్నాడు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడని గుర్తించి ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం రైలు ఆగిన వెంటనే అతనిని మహిళా ఎస్‌ఐ వి.కాంతిప్రియ అరెస్టు చేశారు. అతని వద్ద నకిలీ జడ్జి ఐడీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వివిధ రకాల చిరునామాలతో అతని దగ్గర కార్డులు ఉండడాన్ని గుర్తించారు.

### ఇసుక లారీల అడ్డగింత

పెనుగొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పెరవలి మండలం కడింపాడు ఇసుక ర్యాంప్‌లో లారీలకు లోడింగ్ చేస్తూ ట్రాక్టర్‌లకు లోడింగ్ చేయడం లేదని ఆరోపిస్తూ ట్రాక్టర్‌ల యజమానులు బుధవారం పెనుగొండ మండలం దొంగరావిపాలెం వద్ద ఏటిగట్టుపై లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ట్రాక్టర్ డ్రైవర్‌లు మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో ట్రాక్టర్‌లు ద్వారా ఇసుక ఉచితంగా తీసుకెళ్ళవచ్చని చెబుతున్నా ట్రాక్టర్‌లకు ఎందుకు లోడింగ్ చేయడం లేదని ప్రశ్నించారు. ట్రాక్టర్‌లకు కూడా లోడింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్‌లకు ఎగుమతులు చేయాలంటే సంబంధిత పంచాయతీ అధికారుల నుంచి అనుమతి పత్రం తెచ్చుకోవాలని నిర్వహకులు చెబుతున్నారని పేర్కొన్నారు. చర్చలు తర్వాత లారీలను వదిలేశారు.



### సచివాలయంలో బ్యాటరీలు చోరీ

పెదవేగి, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : అం కన్నగూడెం గ్రామ సచివాలయంలో మూడు ఇన్వర్టర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. సిబ్బంది మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని సచివాలయానికి తాళాలు వేసి వెళ్ళారు. తిరిగి బుధవారం ఉదయం వచ్చే సరికి తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్ళి చూడగా ఇన్వర్టర్ బ్యాటరీలు మూడు కనిపించలేదు. దీనిపై గ్రామ కార్యదర్శి కొడాలి శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కె.రామకృష్ణ చెప్పారు.

### మోటార్ సైకిల్ దొంగకు ఆరు నెలల జైలు

భీమవరం క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఒకటవ పట్టణంలో జరిగి న మోటార్ సైకిల్ దొంగతనం కేసులో నిందితుడికి కోర్టు ఆరు నెలల జైలుశిక్ష విధించింది. వన్‌టౌన్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గత ఏడాది భీమవరం పట్టణానికి చెందిన గోను మోజేష్ మోటార్ సైకిల్ దొంగతనం చేయగా అతనిని అరెస్ట్ చేసి మోటార్ సైకిల్ రికవరీ చేశారు. అయితే ఆ కేసును బుధవారం విచారణ చేసిన సెకండ్ ఏజీఎఫ్‌సిఎం న్యాయాధికారి ధనరాజు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు తెలిపారు. ఈ కేసును ఏపీపీ అరుణ మాధవి వాదనలు వినిపించగా కానిస్టేబుల్ మురళీ సహకరించారు

### బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రగాయాలతో మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెంలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంకు చెందిన ములకలపల్లి ఎలిషా (65) తాడేపల్లిగూడెం సీడబ్ల్యూసీ గోదాముల్లో కూలిగా పనిచేస్తున్నాడు. గోదాముల వద్దకు వెళ్లేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఎలిషాను ఓ వాహనం ఢీకొట్టింది. దీంతో కిందపడిపోయిన ఎలిషాను ఆర్టీసీ బస్సు లాక్కుపోవడంతో తీవ్రగాయా లయ్యాయి. వెంటనే ఆ వృద్ధుడిని తాడేపల్లి గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారిం చారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు వివరించారు

# అరకొర పనులతో అవస్థలు...

## తడికలపూడి, రావికంపాడు రోడ్డు అధ్వానం

## గోతుల కారణంగా ప్రజలకు తప్పని పాట్లు

కామవరపు కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్రాంతి పండుగలోపు ప్రధాన రహదారుల్లోని గోతులను పూడ్చి సజావుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.అయితే ఏలూరు- జంగారెడ్డి గూడెం ప్రధాన రహదారిలోని కామవరపుకోట మండలం తడికలపూడి నుంచి రావికంపాడు వరకు ఉన్న రహదారిలో కొన్ని చోట్ల గోతులు పూడ్చినప్పటికీ పూర్తి స్థాయిలో గోతులు, మార్జిన్లు అలాగే వదిలేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోతుల కారణంగా రాకపోకలు ఎలా సాగించాలని వాహనదారులు భగ్గుమంటున్నారు.తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ గోతుల కారణంగానే అనేక మంది ప్రమాదాల బారిన పడి కొందరు గాయాలపాలవగా మరికొందరు మృత్యువాత పడ్డారని పలువురు పేర్కొంటున్నారు. ఈ గోతుల కారణంగా వాహనాలపై వెళ్తూ అనేక మంది మృత్యువాతపడినా పాలకుల్లో స్పందన కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన ఉన్న గోతులను పూడ్చిరాకపోకలు రహదారులను సజావుగా ఉండేలా చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రజలు,వాహనదారులు అధికారులు, పాలకులను అభ్యర్థిస్తున్నారు. రోడ్డు మార్జిన్లను పూడ్చాలని కోరుతున్నారు.



భారీ గోతులతో అధ్వానంగా మారిన ఏలూరు - జంగారెడ్డి గూడెం రోడ్డు

### భీమడోలు రైల్వే గేటు మూసివేత

భీమడోలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు రైల్వే గేటు సమీపంలో అత్యవసర ట్రాక్ మరామత్తులు కొనసాగుతున్నాయి. ఈ మరమ్మతుల కారణంగా రైల్వే గేటు మూసివేశారు. ఈ నెల 30వ తేదీ వరకు పనులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. వాహనదారులు, ప్రయాణికులు గమనించాలని కోరారు.

### ఏకలవ్య మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కె.ఆర్.పురం ఐటీడీఏ పరిధిలోని విప్పలపాడులో ఉన్న ఏకలవ్య మోడల్ రిసిడెన్షియల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ మిశ్రా తెలిపారు. 2025 - 26 విద్యా సంవత్సరానికి ఫిబ్రవరి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షలో వచ్చిన మార్కులను బట్టి సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

### కొక్కిరపాడులో పొలం పిలుస్తోంది

పెదపాడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి) :పెదపాడు మండలం కొక్కిరపాడు, వసంతవాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వ్యవసాయాధికారి ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని రైతులకు క్షేత్ర స్థాయిలో పంటలపై పూర్తి స్థాయి అవగాహన, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మట్టి నమూనాల సేకరణ, ఫలితాలపై అవగాహన కల్పిస్తున్నట్టు ఏవో ప్రదీప్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బాదంపూడిలో ఆక్వా రైతులకు శిక్షణ

ఏలూరు టూటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దేశీయ జలమత్స్య సంవర్ధన శిక్షణ కేంద్రం బాదంపూడిలో ఆక్వా రైతులకు శిక్షణ ఇస్తున్నట్టు మత్స్య శాఖ జిల్లా అధికారి వి.నాగలింగాచార్యులు తెలిపారు. అభ్యర్థులు ఫిబ్రవరి 19వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 5వ తరగతి ఆపైన చదువుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తామని, తెలుగులో చదవడం, రాయడం, వచ్చి ఉండాలని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు బాదంపూడిలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు దరఖాస్తులు పంపాలన్నారు. ఫిబ్రవరి 20న ఇంటర్వ్యూలు ఉంటాయని, ఇతర వివరాలకు 95733 37484ను సంప్రదించాలన్నారు.

### ఏలూరులో నేడు లోకేశ్ జన్మదిన వేడుకలు

ఏలూరు టూటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్టు అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు.జిల్లా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జన్మదిన వేడుకలు ప్రారంభమవుతాయని అన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరై జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

### సర్వైకల్ క్యాన్సర్ నివారణపై అవగాహన

ఏలూరు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతలో భాగంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పిస్తున్నట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి తెలిపారు. నివారణా చర్యల్లో భాగంగా ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాలను బుధవారం ప్రారంభించినట్టు స్పష్టం చేశారు. 9 నుంచి 45సంవత్సరాల వయస్సు గల మహిళలకు సర్వై కల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు వ్యాక్సినేషన్‌పై సలహాలివ్వనున్నట్టు తెలిపారు.

### ఎక్సైజ్ కానిస్టేబుల్ భార్యకు ఆర్థిక సహాయం

ఏలూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఇటీవల గుండె పోటుతో మరణించిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ కొడమంచిలి వీర వెంకట డేవిడ్ భార్య రెబాకుకు లక్షా 37 వేల రూపాయలను బుధవారం ఏలూరు కార్యాలయంలో ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ప్రభు కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్యలు అందజేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎక్సైజ్ శాఖ అధికారులు, హెడ్‌కానిస్టేబుళ్లు, కలసి కొంత నగదును సేకరించి శ్రీలత చేతులమీదుగా అందజేశారు.

### 26న జాతీయ పతాకాన్ని ఎగురవేసేది హెచ్‌ఎంలే

ఏలూరు అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 26న అన్ని విద్యా సంస్థల్లో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే స్కూలు విద్యార్థులతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించడంతో దేశభక్తి గీతాలాపన జరిపించాలని ఆదేశించారు.

### జాతీయ జెండాలు ఉచితంగా పంపిణీ

ఏలూరు టూటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ జెండాను ఉచితంగా పంపిణీ చేసి దేశ భక్తిపై అవగాహన కలిగిస్తామని బహుజన ఆఫీసర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఏలూరు కలెక్టరేట్‌లో జాతీయ జెండాను కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. అనంతరం విశ్రాంత తహసీల్దార్ నాగేశ్వరరావు మాట్లాడుతూ 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటికీ జాతీయ జెండా ఎగురవేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### భారీ ప్యాకేజ్ విశాఖ ఉక్కుకు వరం

ఏలూరు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) :విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలకపాత్ర పోషించారని, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ నగర అధ్యక్షులు ఎన్.కాశీనరేష్ పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ విశాఖ ఉక్కుపై చేసిన కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌కు రూ.11వేల 440 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించడం పట్ల బుధవారం పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. భారీ ప్యాకేజ్ విశాఖ ఉక్కుకు వరమన్నారు.

### 'మహిళలకు సంక్షేమ పథకాలు'

ఏలూరు టూటౌన్, జనవరి22(ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ పథకాలు పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేసిందన్నారు. వైసీపీ అక్రమాలు నిగ్గు తేలుస్తామన్నారు.

### 'కొల్లేరు ప్రజల జీవన స్థితిగతులను పట్టించుకోవాలి'

ఏలూరు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) :కొల్లేరుపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కొల్లేరు ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, కొల్లేరులో పర్యావరణ పరిరక్షణకు తాము వ్యతిరేకం కాదని అయితే కొల్లేరులోని ప్రజల జీవన స్థితిగతులను కూడా పట్టించుకోవాలని రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కువ విస్తీర్ణంలో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుచేస్తే ఆక్వా పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పళ్ళెం ప్రసాద్, జయపురం సర్పంచ్ మోషే, గుడిపాడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### 'రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలి'

చింతలపూడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : రోడ్లపై ఉన్న గోతులను పూడ్చేందుకు చేపట్టిన మరమ్మతుల పనుల్లో నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించాలని సీపీఎం మండల కమిటీ విజ్ఞప్తి చేస్తోంది. ఇటీవల ప్రభుత్వం చింతలపూడి, టి.నర్సాపురం, తీగలవంచ రోడ్డులో మరమ్మతులు చేపట్టినా తిరిగి గోతులు పడుతున్నాయని ఆరోపించారు. ప్రజాధనం వృధా కాకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు.

### డిజిటల్ సర్వేలు వేగవంతం చేయాలి

జంగారెడ్డిగూడెం,జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణ,గ్రామ సచివాలయాల పరిధిలో జరిగే డిజిటల్ సర్వేలను వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ సిఈఓ, జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి కె.సుబ్బారావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఓ కెఆర్ఎస్.కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన డివిజనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ సిఈఓ సుబ్బారావు అధికారులకు పలు సూచనలు చేశారు.

## రహదారుల సమగ్రాభివృద్ధికి చర్యలు :చింతమనేని

పెదపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల సహకారంతో దెందులూరు నియోజకవర్గంలో రహదారుల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలం పునుకొల్లులో ప్రభుత్వ నిధులు రూ.85 లక్షలు, తోటగూడెంలో రూ.10 లక్షలతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్లను, తోటగూడెంలో గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. చింతమనేని మాట్లాడుతూ సూపర్ సిక్స్ కార్యక్రమాలను సూపర్ సక్సెస్‌గా, నియోజకవర్గంలో గత ప్రభుత్వ కాలంలో అభివృద్ధికి నోచుకోని రహదారులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో 180 గోకులం షెడ్లను లబ్ధిదారులకు మంజూరు చేసినట్టు తెలిపారు. పునుకొల్లులో రూ.1.5 లక్షలతో ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతులకు అధికారులను ఆదేశించారు.


పునుకొల్లు - తోటగూడెం రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరం :ఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికి అనుగుణంగా రహదారి ప్రమాదాల నివారణ కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పేర్కొన్నారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి డైరెక్టర్ గోకరాజు రతీదేవి, ఆశ్రం యాజమాన్యం 40 ట్రాఫిక్ బారికేడ్లను జిల్లా పోలీసులకు బహూకరించారు. వాటిని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద బుధవారం రాత్రి ఎస్పీ కిశోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం, వాహనాల వేగ నియంత్రణ కోసం ఈ బారికేడ్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఆశ్రం ఆసుపత్రి డైరెక్టర్ గోకరాజు రతీదేవి, ఆశ్రం యాజమాన్యం, 40 బారికేడ్లను బహూకరించడం ఎంతో అభినందనీయమన్నారు.


బారికేడ్లను ప్రారంభిస్తున్న ఎస్పీ కిశోర్

## వ్యవసాయ ఉత్పత్తులపై మద్దతు ధర కోసం 26న నిరసనలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ కోసం కేంద్రం నూతన చట్టాలను తీసుకొస్తోందని రైతు వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పవరుపేటలోని అన్నేభవనం వద్ద సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు చర్చించి తగు నిర్ణయాలు తీసుకున్నారు. రైతు ప్రయోజనాల కోసం ఈనెల 26న కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనలు, ర్యాలీలు జరపాలని తీర్మానించినట్టు సంయుక్త కిసాన్ మోర్చ సంఘ నాయకులు కె.శ్రీనివాస్,బండి వెంకటేశ్వరరావు, షేక్ బాష, పి.రామకృష్ణ, ఆర్.శ్రీనివాస డాంగేలు ప్రకటించారు. 26న జరిగే నిరసన ధర్నా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు, రైతు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గ్రామగ్రామాన ప్రచారం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు పుప్పాల కన్నబాబు, ఎస్.సుందరరావు, టి.సత్యనారాయణ, ఎస్.అప్పారావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.


సంఘీభావం తెలియజేస్తున్న సంఘ నాయకులు

## 'ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందించండి'

వేలేరుపాడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ప్రగతిశీల మహిళా సంఘం డిమాండ్ చేసింది. పాత ప్రభుత్వవైద్యశాల భవనం గోదావరి వరదల కారణంగా శిథిలమవడంతో ఆసుపత్రిలో బీసీ సంక్షేమ హాస్టల్‌ను నిర్వహిస్తున్నారని ఆసుపత్రికి వచ్చిన రోగులు, స్త్రీలు మరుగుదొడ్లు లేకపోవడం వలన ఇబ్బంది పడుతున్నారని మహిళా సంఘం ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చోడే విజయ, ఎస్కే.మున్నీ ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ అగదాకు వివరించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆసుపత్రి పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా ఉందని ఆసుపత్రి బెడ్‌ల పై పరుపులు కూడా లేవని రోగాలను నిర్ధారించే కిట్‌లు లేవని వారు వివరించారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్ళి ఆసుపత్రి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి విన్నవించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘ నాయకురాళ్లు పాల్గొన్నారు.


వైద్యాధికారితో మాట్లాడుతున్న సంఘ మహిళలు

## 25 నుంచి ఓటు హక్కుపై విస్తృత అవగాహన

టి.నరసాపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ నెల 25న నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవంపై అవగాహన కార్యక్రమాలు విజయవంతం చేయాలని తహసీల్దార్ టి.సాయిబాబా బుధవారం పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓట్‌ఫర్ ష్యూర్ అనే నినాదంతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవడం, 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రతి పోలింగ్ బూత్ పరిధి, ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఓటర్లంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సైబర్ నేరాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

పెదవేగి, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుకూలంగా మార్చుకుంటూ నేరాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.కాంతిప్రియ అన్నారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ ఆదేశాలను అనుసరించి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు సూచనలతో ఎస్ఐ కాంతిప్రియ ఆధ్వర్యంలో అభయ రక్షక దళం పెదవేగి మండలం విజయరాయి, పినకడిమి, కొప్పాక గ్రామాల్లో పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కాంతిప్రియ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డుపెట్టుకుని కొంతమంది సైబర్ నేరాలకు పాల్పడుతూ అమాయకులను దోచుకుంటున్నారని అన్నారు. తెలియని నంబర్లనుంచి వచ్చే యాప్‌లు, లింకులు, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఏదైనా అత్యవసర సహాయం కోసం డయల్ 112 సేవలు అందుబాటులో ఉంటాయని, బాలికలు, మహిళలు, వృద్ధుల రక్షణ కోసం 9550351100 నంబర్‌కు సమాచారం అందించాలని కాంతిప్రియ సూచించారు. బాల్య వివాహాలు చేస్తున్నట్టు సమాచారం ఉంటే 1098 నంబర్‌కు, సైబర్ నేరాలకు గురైతే 1930 నెంబర్ లో ఫిర్యాదు చేస్తే తక్షణ సాయం అందుతుందని ఎస్ఐ వివరించారు.


పినకడిమిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

### మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు

పోలవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు పోలవరంలో భారీగా నిర్వహించేందుకు టీడీపీ నాయకులు కొవ్వాసు జగదీశ్వరి యువసేన ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాట్లు చేశారు. ఏటిగట్టు సెంటర్‌కి సమీపంలో ఆరాధ్య రెసిడెన్సీ ఆవరణలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, నియోజకవర్గంలో అన్ని మండలాల నుంచి కూటమి నాయకులు పాల్గొంటారని తెలిపారు.

### ఉపాధి పనుల్లో అవకతవకలపై ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

భీమడోలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలం ఆగడాలలంక గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నకిలీ మస్తరు నమోదు చేస్తున్నట్టు గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ నేతల విశాలానంద్‌పై గ్రామంలో విచారణ నిర్వహించారు. విచారణాధికారిగా ఎంపీడీవో సి.హెచ్. పద్మావతి హాజరయ్యారు.గత ఐదు సంవత్సరాలుగా గ్రామంలో ఉండని వారికి సైతం మస్తరు వేసి ఉపాధి సొమ్ము చెల్లిస్తున్నట్లుగా ఫిర్యాదుదారులు రాతపూర్వకంగా అందాయని తెలిపారు. సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌పై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పద్మావతి తెలిపారు.

### ఉరుసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు కార్పొరేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోట దిబ్బ వద్ద ఉన్న దర్గా వద్ద హజరత్ సయ్యద్ బాయజీద్ మహాత్ములు ఉరుసోత్సవాన్ని ఈ నెల 26వ తేదీన నిర్వహిస్తున్నట్టు ముజావర్లు తెలిపారు. ఉరుసు సందర్భంగా దర్గా వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ముస్లిం సంప్రదాయానికి అనుగుణంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లా నలుమూలల నుంచి ఈ ఉరుసు మహోత్సవానికి ముస్లిం సోదరులు, అభిమానులు విచ్చేస్తారని తెలిపారు.

### రైతుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు

టి.నరసాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని చింతలపూడి ఏడీఏ బి.నాగకుమార్ కోరారు. మండలంలోని బందంచర్ల, కేతవరం గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ అధికారి బి. సుమలత ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగకుమార్ రైతులతో కలిసి మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు.

### పోలీస్ డైరీని ఆవిష్కరించిన ఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కష్టపడి సిబ్బందికి నిత్యం ఉపయోగపడేలా అన్ని అంశాలను క్రోడీకరించి సిబ్బందికి డైరీని రూపొందించడం అభినందనీయమని ఎస్పీ కేపీఎస్ కిశోర్ పేర్కొన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం పోలీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రూపొందించిన పోలీస్ డైరీని ఎస్పీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

### ఒలింపియాడ్ పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : తమ విద్యార్థులు ఆలిండియా ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబరిచినట్లు శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరినీ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించింది. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, రామ్మోహన్ పాల్గొన్నారు.

### అయోధ్య బాలరాముడి శోభాయాత్ర

కొయ్యలగూడెం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బయ్యన్నగూడెంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభా యాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఆ గ్రామంలోని రామాలయం నుంచి శోభాయాత్రగా బయల్దేరి గ్రామమంతా జైశ్రీరామ్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి రామాంజనేయ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

### లెనిన్ స్ఫూర్తితో కమ్యూనిస్టు దేశాల్లో రాజ్యాధికారం

జంగారెడ్డిగూడెం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు సిద్ధాంతకర్త వి.ఐ.లెనిన్ పోరాట స్ఫూర్తితో ప్రపంచంలోని కమ్యూనిస్టు దేశాలన్నీ రాజ్యాధికారం సాధించాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. లెనిన్ శత జయంతో త్సవాల్లో భాగంగా బుధవారం సీపీఎం పట్టణ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, మండల కార్యదర్శి ఎం.జీవరత్న, జె.సూర్యచంద్రం, ఎ.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

### పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

పెదవేగి, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : జీవాలకు సకాలంలో టీకాలు వేయిస్తే అనేక వ్యాధుల నుంచి బయటపడవచ్చని పెదవేగి మండల పశువైద్యాధికారి తారకేశ్వరరావు అన్నారు. పెదవేగి మండలం జగన్నాథపురంలో పశువులకు బుధవారం వ్యాధినిరోధక టీకాలు వేశారు. అలాగే వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిణి డాక్టర్ ఫౌజియా ఉన్నారు.

### దళిత గిరిజనులకు పట్టాలివ్వాలి

ఏలూరు కార్పొరేషన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువ రిజర్వాయర్ లోని మిగులు భూముల్లో సాగు కోసం అవకాశం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్వో విశ్వేశ్వరరావుకి బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం వినతిపత్రాన్ని అందజేసింది. అనంతరం రవి మాట్లాడుతూ 1985లో ఎర్రకాలువ రిజర్వాయర్ కోసం తొమ్మిది వేల ఎకరాలు సేకరించగా మూడు వేల ఎకరాలు ముంపులో లేవన్నారు. ఆ భూములను సాగు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అర్జీలను అందజేసిన వారిలో జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఎం.సుధారాణి, రాజు, దుర్గమ్మ తదితరులు ఉన్నారు.

### నేటి నుంచి ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్య కార్మికుల సమ్మె

ఏలూరు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్ల సాధన కోసం 24వ తేదీ నుంచి సార్వత్రిక సమ్మె చేస్తున్నట్టు ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, జిల్లా కార్యదర్శి తత్తాత్రేయలు ప్రకటించారు. ఈ మేరకు నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో పని చేసే పారిశుధ్య కార్మికులకు పిఎఫ్, ఐదు నెలల జీతాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వందమందికిపైగా పారిశుధ్య కార్మికులు బుధవారం ఉదయం గంట పాటు విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు.

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భీమడోలు, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో దోమల నిర్మూలన సామాజిక బాధ్యత అని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు అన్నారు. మండలంలోని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యాధికారులు సందర్శించి ప్రజలకు, రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. స్థానిక వైద్యాధికారి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మలేరియా అధికారి గోవిందరావు పాల్గొని మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

### జనసేన పార్టీ బలోపేతానికి కృషి : క్రాంతి కిరణ్

కొయ్యలగూడెం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ముద్రగడ కుమార్తె జనసేన నాయకురాలు క్రాంతి కిరణ్ కోరారు. ఈ మేరకు బుధవారం కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లోని జనసేన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన పార్టీ మరింత బలోపేతానికి తాను కృషి చేస్తానని అన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి జనసేనలో చేరానని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చోడిపిండి సుబ్రహ్మణ్యం, మండల జనసేన అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.


బీజేపీ జిల్లా అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే చంటి

### బీజేపీ జిల్లా అధ్యక్షుడికి ఎమ్మెల్యే చంటి అభినందన

ఏలూరు టూటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షునిగా రెండవ సారి నియమితులైన చౌటపల్లి విక్రమ్ కిశోర్ ఎమ్మెల్యే చంటిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన కలవగా చంటి అభినందించారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఒక భాగమని తామంతా కలిసి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చంటి పేర్కొన్నారు.

### డ్రోన్ సాయంతో మందుల పిచికారీ

భీమడోలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలం వడ్లపట్ల సమీపంలోని పంట పొలాలకు డ్రోన్ సాయంతో మందులను పిచికారీ చేసే కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పరిశీలించారు. ఈ విధానంలో మందుల పిచికారీ మంచి ఫలితాన్ని ఇస్తుందని తెలిపారు. సేంద్రియ మందులను డ్రోన్ సాయంతో పిచికారీ చేస్తే మరింత లాభంగా ఉంటుందన్నారు.


ప్రత్యేక అలంకరణలో గణనాథుడు

### లక్ష్మీ గణనాథునికి అర్చనలతో నివేదనలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సత్రంపాడులోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద బుధవారం భక్తులు సామూహిక అర్చనలు జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. తొలుత ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ అభిషేకం నిర్వహించి అనంతరం విశేష అలంకరణ జరిపి ప్రత్యేక హారతులు ఇచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిన నాగేశ్వరరావు, మిత్రబృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

### నేటి నుంచి బాలోత్సవం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26 వరకు వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు వేదికగా ఐదవ పిల్లల హేలాపురి బాలోత్సవాలను నిర్వహిస్తున్నట్టు సంఘ నాయకులు అడుసుమిల్లి నిర్మల, ఆలపాటి నాగేశ్వరరావు, దేవరకొండ వెంకటేశ్వర్లు గుడిపాటి నరసింహారావులు తెలిపారు. బుధవారం అన్నేభవనం వద్ద బాలోత్సవానికి సంబంధించిన సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. 69 అంశాల్లో నర్సరీ నుంచి పదవ తరగతి విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించే వేదికగా బాలోత్సవం కొనసాగుతుందన్నారు.

### ఉల్లాస్‌తో వయోజన అక్షరాస్యతా కార్యక్రమం

నిడమర్రు జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజనులైన డ్వాక్రా మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వయోజన విద్య నోడల్ అధికారి కె.వి.వి. సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం నిడమర్రు వెలుగు కేంద్రంలో డ్వాక్రా యానిమేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వయోజన విద్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రత్న కుమార్, వెలుగు సిసిలు , డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

### పోలాసిగూడెంలో రీ సర్వే

కామవరపుకోట, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా కామవరపు కోట మండలంలోని పోలాసిగూడెం గ్రామంలో రీ-సర్వే జరిపేందుకు అనుమతి ఇవ్వగా తహసీల్దార్ గెడ్డం ఎలీషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సర్వేయర్లు, వీఆర్వోలు సంయుక్తంగా బుధవారం రీసర్వే పనులను ప్రారంభించారు. గ్రామ సరిహద్దులను నిర్ణయించడం, రికార్డుల ప్రకారం భూములను కొలవడం, రైతులను సమన్వయపర్చడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ రెవెన్యూ పరిపాలనా అధికారులు బి.రమేష్, సాగిపాడు వెంకన్నబాబు ఉన్నారు.




వడాలిలో కమ్యూనిటీ హాలు దుస్థితి.. దేవపూడిలో మూతపడిన కమ్యూనిటీ హాలు

# శిథిలావస్థలో కమ్యూనిటీ హాళ్లు

## పట్టించుకోని అధికారులు

ముదినేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన సామాజిక భవనాలు (కమ్యూనిటీ హాళ్లు) నిరుపయోగంగా మిగిలాయి. రెండు దశాబ్దాల క్రితం ఎంపీ, ఎమ్మెల్యేల నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను ఏ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలో 1992 నుంచి 2004 వరకు 24 కమ్యూనిటీ హాళ్లను వివిధ గ్రామాల్లో నిర్మించారు. వీటిలో అధికశాతం బీసీ, ఎస్సీ ఏరియాల్లో నిర్మించారు. ఆపై వీటి నిర్వహణ బాధ్యతలను ఎవరూ తీసుకోలేదు. కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలుగా, పశు వైద్యానికి తాత్కా లిక కేంద్రాలుగా వినియోగించినా కాల క్రమేణా భవనాలు శిథిలా వస్థకు చేరుకోవడంతో పూర్తిగా మూత పడ్డాయి. వడాలి, కాకర వాడ, విశ్వనాద్రి పాలెం, సంకర్షణపురం, దేవపూడి తదితర గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు శిథిలం కాగా, చేవూరు దళితవాడలోని కమ్యూనిటీ హాలు కూలే దశకు చేరుకుంది. కొన్ని చోట్ల మరమ్మతులు చేయిస్తే వినియోగించుకునే అవకాశం ఉన్నా అధికారులు పట్టించు కోవడం లేదు. 'గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల పరిస్థితిని పరిశీలించే విషయాన్ని పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్తా. ఆ భవనాల మరమ్మతులు, వినియోగంపై చర్యలు తీసుకు నేందుకు ప్రయత్నిస్తాను' అని ఈవోపీఆర్డీ అశోక్ తెలిపారు.



చేవూరులో శిథిలమైన కమ్యూనిటీ హాలు

# పీఎం సూర్య ఘర్‌లో 11 యూనిట్ల ఏర్పాటు

ముదినేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద మండలం లోని గ్రామాల్లో గృహాలపై సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పథకం కింద ఒక్కో యూనిట్ ఏర్పాటుకు రూ.2.10 లక్షల వ్యయం అవుతుందని, ఇందులో బ్యాంక్ రుణం రూ.లక్షా 90 వేలు, లబ్ధిదారుడి వాటా రూ.78 వేలు కేంద్ర పభుత్వం సబ్సిడీ ఇస్తుండ డంతో ఈ యూనిట్ల ఏర్పాటుకు విద్యుత్ వినియోగదారులు ముందుకొస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు రోజుకి మూడు కిలో వాట్స్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 11 సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేశారు.



ముదినేపల్లి శివారు అన్నవరంలో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ పవర్ యూనిట్

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్ బదిలీ

ఏలూరు క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి చింతలపూడి పురుషోత్తమ కుమార్ ను బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో నలుగురు జడ్జిలను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి పశ్చి మగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ ను గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ జ్యూడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఏలూరులోని ఎస్సీ, ఎస్టీ కోర్టు జిల్లా న్యాయమూర్తి సునీల్ కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

# అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ప్రగడవరం గ్రామానికి చెందిన కొనకళ్ళ శ్రీనివాసరావు (39) భార్య లక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యవసాయం చేయడానికి అప్పుల పాలయ్యాడు. వీటిని తీర్చే మార్గం కానరాక ఈనెల 21వ తేదీ రాత్రి పురుగు మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

# కట్నం వేధింపుల కేసులో నకిలీ జడ్జి అరెస్టు




నిందితుడిని అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జడ్జినంటూ మోసం చేసి యువతిని పెళ్లి చేసుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ బుధవారం రాత్రి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ భగవత్‌నగర్‌కు చెందిన నామాల నరేందర్ (33) ఇతను ఒక మ్యాట్రిమోనీకి తన బయోడేటా పంపించారు. తాను జడ్జినని తెలంగాణలో పనిచేస్తున్నానని చెప్పి వివరాలు పెట్టాడు. ఏలూరు కొత్త పేటకు చెందిన సామంతుల నిర్మలకు 2019లో మేట్రిమోని ద్వారా అతను పరిచయం అయ్యాడు. ఆ పరిచయంతో పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడు. అయితే అతను జడ్జి అని చెప్పడంతో ఇరువురు కుటుంబ సభ్యులు మాట్లాడుకుని 2022లో రూ.75 లక్షలు కట్నం అడగగా రూ.25 లక్షలు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలం ఖమ్మంలో కాపురం పెట్టారు. ఆ తరువాత అతను అప్పటికే పలువురికి కోర్టులలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసగించడంతో తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, ఉప్పల్, చాందానగర్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదు కావడంతో అతనిని అరెస్టు చేశారు. అంతేకాకుండా నిర్మలను రూ.50 లక్షలు తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తున్నాడు. అతను జడ్జి కాదని తెలుసుకున్న నిర్మల గత నెల నవంబర్ 12న ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ కాంతిప్రియ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నామాల నరేందర్ పోలీసులకు చిక్కకుండా పరీరాలో ఉన్నాడు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడని గుర్తించి ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం రైలు ఆగిన వెంటనే అతనిని మహిళా ఎస్ఐ వి.కాంతిప్రియ అరెస్టు చేశారు. అతని వద్ద నకిలీ జడ్జి ఐడీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వివిధ రకాల చిరునామాలతో అతని దగ్గర కార్డులు ఉండడాన్ని గుర్తించారు.

# ట్రిపుల్ ఐటీ టెక్ జెట్ అధికారిక వెబ్‌సైట్ ప్రారంభం

నూజివీడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ నూజివీడు క్యాంపస్ పరిధిలో ప్రతి సంవత్సరం నిర్వహించే జాతీయస్థాయి సాంకేతికోత్సవం టెక్‌జెట్ 25 అధికారిక వెబ్‌సైట్‌ను నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, డాక్టర్ అమరేంద్రకుమార్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించటంలో టెక్‌జెట్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. దాదాపు 5 వేలమంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని, టెక్‌జెట్-25లో భాగంగా రోబోటిక్స్, కోడింగ్, హ్యాక్‌థాన్ తదితర అంశాలపై ప్రదర్శనలు ,ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. విజేతలకు రూ.5 లక్షలు విలువైన ప్రైజ్‌మనీతో పాటు సర్టిఫికెట్లను ఇస్తామన్నారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాల ప్రదర్శనకు ఈ ఉత్సవాలు ఉపయోగపడతాయని చెప్పారు. ట్రిపుల్‌ఐటీ ఏవో డాక్టర్ లక్ష్మణరావు, జ్యోతిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## • పెరిగిన చలి... పొగ మంచు

చలి తీవ్రత పెరిగింది. దీనితో పాటు తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్ముకుంటున్నది. వాహనదారులకు రోడ్లపై ఎదురుగా ఉన్న వాహనాలు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండవల్లిలో బుధవారం ఉదయం ఉష్ణోగ్రత 16 డిగ్రీలు నమోదు అవ్వగా, రాత్రులు కనిష్ఠ ఉష్ణోగ్రత 15డిగ్రీలు లోపు నమోదు అవుతుంది. చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు శ్వాసకోస వ్యాధి, జలుబు, జ్వరాలతో అనారోగ్యనికి గురవుతున్నారు.

\- మండవల్లి





వెంకటాపురంలో మినుము పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

# మినుము పైరులో తెగుళ్లు

కలిదిండి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు, వెంకటాపురం గ్రామాల్లో బుధవారం విజయరాయి ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణికుమార్, సుధారాణి మినుము పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినుము పైరులో మారుకా మచ్చల పురుగు, పొగాకు లద్దె పురుగు, పల్లాకు తెగులు బూడిద తెగులు ఉధృతంగా ఉందన్నారు. వీటి నివారణకు నోవాల్యురన్ 2 మిల్లీ లీటర్లు మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ నివారణకు థెయామితాక్సిమ్ 0.2 గ్రాముకు లీటరు నీటికి కలపి పిచికారీ చేయాలన్నారు. బూడిద తెగులు నివారణకు కార్బండిజమ్ లేదా కవచ్ పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ గంగాధర్ రావు, మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, రైతులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులు పాటించాలి

కైకలూరు : మినుము పంట పూత దశలో రైతులు యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. బుధవారం ఆచవరం, వింజరం, తామరకొల్లు, వేమవరప్పాడులో మినుము పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లలితసుధా, కైకలూరు ఏడీఏ గంగాధరరావు, ఏవో దివ్య, రైతులు, ఏఏలు పాల్గొన్నారు.

## మినుము పైరుకు నీరివ్వండి..

ముదినేపల్లి : మినుము పైరుకు నీటి ఎద్దడిని నివారిం చేందుకు కాల్వలకు నీరు విడుదల చేయా లని చేవూరు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు శాయిన ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు బొమ్మిశెట్టి వెంకన్న కోరారు. 'నీరందక ఎండుతున్న మినుము పైరు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురి తమైన వార్తకు స్పందించిన వారు క్యాంప్ బెల్ కెనాల్ కింద మండలంలోని పలు గ్రామాల ఏరియాల్లో నీరు లేక ఎండిపోతు న్న మినప సాగు భూముల పరిస్థితిని కృష్ణా తూర్పు డెల్టా ఎస్ఈ మోహన రావుకు ఫోన్‌లో వివరించారు.

## వృద్ధాశ్రమం ప్రారంభం

కలిదిండి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పెదలంక గ్రామంలో శివ దుర్గా సేవా ట్రస్ట్ చైర్మన్ పంతగాని వెంకటేశ్వరరావు, పాస్టర్ దుగ్గిరాల సామ్యూల్ రాజ్‌తో కలసి వృద్ధాశ్రమం ప్రారంభించారు. కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాల బ్రహ్మాజీరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు దుగ్గిరాల పరమేశ్వరరావు పాల్గొన్నారు.

## గడ్డివాము దగ్ధం

కైకలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాచపట్నం శివారు చింతలచెరువు గ్రామంలో రంపా నారయణకు చెందిన ఆరు ఎకరాల గడ్డివాములో అర్ధరాత్రి సమయంలో మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. మంటలను అదుపుచేశారు. అప్పటికే సుమారు రూ.50 వేలు విలువ గల గడ్డివాము దగ్ధమైంది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.




బైపాస్ రహదారి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

# ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు : సీఐ

కైకలూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కైకలూరులో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు టౌన్ సీఐ పి.కృష్ణ తెలిపారు. బుధవారం కైకలూరు మెయిన్‌రోడ్డులో బైపాస్ రహదారి వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కైకలూరులో రహదారులు ఇరుకుగా ఉన్నందున ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలు తమ వాహనాలను నిలుపుదల చేసేటప్పుడు సహనంతో రహదారి పక్కకు పార్క్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఆర్.శ్రీను, డి.వెంకట్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల ఐడియా అదిరింది

## చింపాంజీ వేషంతో కోతుల బెడదకు చెక్ - రైతుల సమస్యకు పరిష్కారం

చాట్రాయి, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : కోతల బెడద నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకోటానికి రైతులకు ఒక ఐడియా వచ్చింది. గ్రామంలోని ఒక వ్యక్తికి చింపాంజీ వేషం వేసి చేలల్లో తిప్పుతున్నారు. చింపాంజీ వేషాన్ని చూసిన కోతులు కుయ్యో మొర్రో అంటూ ఆ ప్రాంతం వదిలి పరుగులు తీస్తున్నాయి.పోలవరం గ్రామంలో కొంత మంది రైతులకు వచ్చిన ఈ ఆలోచన మంచి ఫలితాలు ఇస్తున్నట్లు చెపతున్నారు. మండలంలో రబీలో సుమారు 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు అయ్యింది. అన్ని గ్రామాల్లో మొక్కజొన్న రైతులు కోతుల బెడదతో తీవ్ర కష్ట నష్టాలను ఎదుర్కొంటున్నారు. కోతుల మందలు మొక్కజొన్న చేలలో పడి కండెలు విరిచి పంట ధ్వంసం చేస్తున్నాయి. కోతులకు హాని తలపెట్టకూడదనే సెంటిమెంట్ వల్ల వాటి సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు ప్రజలు నరకయాతన పడుతున్నారు. కోతుల నుంచి పంట ఎలా కాపాడుకోవాలో రైతులకు దిక్కుతోచని పరిస్థితి కుటుంబాలు మొత్తం ఉదయం నుంచి పొద్దుకూకే వరకు మొక్కజొన్న పంటను కాపలా కాసుకుంటున్నారు. పోలవరం గ్రామంలో చింపాంజీ ఐడియా కోతులు పరారవుతుండడంతో ఇప్పుడు రైతులందరూ తాము కూడా చింపాంజీ డ్రస్ తెచ్చుకొని కోతుల బెడద నుంచి పంటను కాపాడుకుంటామని అంటున్నారు.



చింపాంజీ వేషధారణలో ఉన్న మనిషి

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

నూజివీడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు సేవించినా, కలిగివున్నా చట్టప్రకారం కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తోందని, నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ మస్తానయ్య అన్నారు. నూజివీడు శారద కళాశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, కొకైన వంటి మత్తుపదార్థాలు సేవించడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. సోషల్ మీడియాకు సైతం దూరంగా ఉండాల్సిన పరిస్థితి విద్యార్థులు గుర్తించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారు తారసపడితే సంబంధిత సమాచారాన్ని తమకు తెలపాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులు

నూజివీడు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాపోటీలకు నూజివీడు బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు ఎన్నికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు. ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. పీడీలు కె.రాణి, సరళలను అభినందించారు.

# గురుకుల పాఠశాలలో సామాజిక తనిఖీలు

### పాఠశాల సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు



తనిఖీలు చేస్తున్న అధికారులు

ముసునూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ముసునూరు గురుకుల పాఠశాలకు వచ్చిన నిధులపై బుధవారం సామాజిక తనిఖీలు జరిగాయి. స్టేట్ రిసోర్స్‌పర్సన్ టి.నందిని, జిల్లా రిసోర్స్‌పర్సన్‌లు డి.నాగభూషణం, రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో పాఠశాలకు 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు వచ్చిన నిధుల వినియోగం, ఖర్చులు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం వంటివి పరిశీలించారు. విద్యార్థులు పలు సమస్యలను తనిఖీ బృందం దృష్టికి తీసుకువచ్చారు. సెప్టిక్ ట్యాంక్ నిండిపోయి దుర్వాసన వేదజల్లుతుందని, ఉపాధ్యాయులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని బాలికలు తెలిపారు. అదనపు మరుగుదొడ్లు కావాలని చెప్పారు. భోజనశాలలో కూర్చొని భోజనం చేయడానికి ఇబ్బందిగా ఉంటుందని సగం ఉడికిన కోడిగుడ్లను పెడుతున్నారని, వరుసగా మూడురోజులు బెండకాయ కూర పెట్టాని బాలికలు వివరించారు. ప్రహరీ లేకపోవడంతో వీధి కుక్కలు పాఠశాలలోకి వస్తున్నాయ న్నారు. ఈ పాఠశాలలో 16 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే ఉన్నారని, దీంతో కొన్ని సబ్జెక్టులు సిలబస్ పూర్తికావడం లేదని రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని బాలికలు కోరారు. అనంతరం ఏస్ఎంసీ సభ్యులతో గ్రామసభ జరిగింది. చైర్మన్ పంగిడియ్య, సభ్యులు పలు విషయాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని పిల్లల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు వస్తే పర్యవేక్షించేందుకు వెళ్తే వార్డెన్ వంటశాలలోకి ఎందుకు రాన్విలేదని ప్రిన్సిపాల్ ప్రవీణను ప్రశ్నించారు. పాఠశాల అభివృద్ధికి కేటయించిన నిధుల వినియోగం, ఖర్చుల వివరాల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని వారు తనిఖీ బృందం సభ్యులకు వివరించారు. దీంతో గ్రామసభలో ఉపాధ్యాయులు, ఏఎంసీ సభ్యుల మధ్య మాటల యుద్ధం సాగాడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఉన్నతాధికారులకు సమగ్ర నివేదికను అందజేయనున్నట్లు ఏస్ఆర్పీ నందిని తెలిపారు.

## వైభవంగా ఈదర సహాయమాత ఉత్సవాలు

ఆగిరిపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఈదర నిత్య సహాయమాత ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సహాయ మాత విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం పాప సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ లాము జయరాజ్ దివ్యబలిపూజ సమర్పించారు. ఎస్సై శుభశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## ఇంటర్వ్యూ..

### సీకే పాడు ఛానెల్ అభివృద్ధికి కృషి



మంచిన పూర్ణచంద్ర రావు, సీకే పాడు సాగునీటి సంఘం చైర్మన్

**• చిన్నంపేట - కోటపాడు ఛానెల్ పరిధిలో ఆయకట్టు ఎంత? చెరువుల పరిస్థితి ఏమిటి?**

జవాబు : వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. ఛానెల్ పరిధిలో ఆంజనేయ చెరువు, సూరన్న చెరువు, రాళ్ళకుంట, కొత్త చెరువు, కోమటి చెరువుకు మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరాయి.

**• ప్రధాన కాలువల పరిస్థితి ఏమిటి?**

జవాబు : ఐదేళ్ల నుంచి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రధాన కాలువ ఏడు కిలోమీటర్ల పొడవున గండ్లు పడి పూడిక పేరుకు పోయి చెట్లు పెరిగి నీరు ప్రవహించే పరిస్థితి కూడా లేదు.

**• వచ్చే ఖరీఫ్ సీజన్‌లోగా ఏమైనా పనులు చేపడతారా?**

జవాబు : తుఫాన్ గ్రాంట్ రూ.10 లక్షలకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు విడుదలైతే గండ్లు పూడ్చి జంగిల్ క్లియరెన్స్ చేస్తాం.

**• సీకే పాడు ఛానల్ ప్రక్షాళనకు ఏం చర్యలు తీసుకుంటారు?**

జవాబు : ప్రధాన కాలువకు, చెరువులకు పూర్తి స్థాయి మరమ్మతులు చేయవలసి ఉంది. కాలువ, చెరువులు పూడిక తీసి గట్లు పటిష్టం చేయాలి.. ప్రభుత్వం నుంచి నిధులు సాధించి వ్యవస్థను ఆధునీకరించడానికి కృషి చేస్తాం.

**• నిధులు మంజూరు సాధ్యమేనా?**

జవాబు : కూటమి ప్రభుత్వం నీటి పారుదల రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి సహకారంతో నిధులు మంజూరు చేయించి శాశ్వతంగా మరమ్మతులు చేయిస్తాం.

(చాట్రాయి)

## 25న జాబ్‌మేళా

నూజివీడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎంవీఆర్ జూనియర్ కళాశాలలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల్లోపు నిరుద్యోగులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

## 25 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ముదినేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బావాజీ మఠంలో కోదండ రామ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 25 నుంచి త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు ప్రారంభమై 27 వరకు జరుగుతాయి. 25న త్యాగరాజ స్వామి చిత్ర పటాన్ని ఊరేగిస్తారు. 26న సుదర్శన హోమం, విష్ణు సహస్రనామ పారాయణం, 27న సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించిన అనంతరం వృద్ధ కళాకారులకు సన్మానం, 27న రాత్రి అన్నసమారాధన నిర్వహిస్తామని నాయీ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు తెలిపారు.

## రేపు కలిదిండి మండల సమావేశం

కలిదిండి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొండల రావు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉచిత పశువైద్య శిబిరాలు

కలిదిండి/మండవల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలంలో కోరుకొల్లు, పెదలంక గ్రామాల్లో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 150 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 500 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. మండవల్లి మండలంలోని భైరవపట్నం, కానుకొల్లుల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. 49 పశువులకు సాధారణ చికిత్స 15 పశువులకు ఎద పరీక్ష చికిత్స, 371 గొర్రెలకు నట్టల నివారణ, 31 లేగదూడలకు ఎలికపాముల నివారణ మందులు వేశారు. మండవల్లి ప్రాంతీయ సహాయ సంచాలకులు వరప్రసాద్ పాల్గొన్నారు.

## పెదగొన్నూరు దేవస్థానం మాజీ చైర్మన్ రామలక్ష్మి మృతి



రామలక్ష్మి (ఫైల్)

ముదినేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పెద గొన్నూరు శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ నాయకురాలు మండవ రామలక్ష్మి(78) మరణించారు. కొంతకాలంగా అస్వస్థతకు గురైన ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. ఆమె మృతి పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.